

నిధులు దిగమింగినా చర్యల్లేవు..!

జిల్లాలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లీనిక్‌లను నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది, కనీసం నిర్మాణాలు ప్రారంభించారో లేదో కూడా అధికారులు పరిశీలించలేదు. కాంట్రాక్టులన్నీ అప్పటి అధికార వైసీపీ నాయకులే హస్తగతం చేసుకున్నారు. కొన్ని చోట్ల నిర్మాణం పేరుతో సిమెంట్‌ను తరలించుకుపోయారు, స్టీల్ నిమిత్తం అడ్వాన్స్ పేమెంట్‌లు చేసేసుకున్నారు. వైసీపీ నాయకులు, అనాటి పంచాయితీరాజ్ శాఖ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ సొమ్మును లక్షల రూపాయలు స్వాహా చేశారు. ఈ నిజాలు సోషల్ ఆడిట్‌లో వెలుగుచూసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ చర్యల్లేవు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భవనాలు నిర్మించకుండానే సిమెంట్, స్టీల్ మాయం

గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు

- వైసీపీ నాయకులే కాంట్రాక్టర్లు.. కుమ్మక్కైన అధికారులు
- సోషల్ ఆడిట్‌లో వెలుగుచూసిన నిజాలు
- నందివాడ మండలంలోనే లక్షలాది రూపాయలు పక్కదారి
- అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.36 లక్షల ఇనుము స్వాహా
- చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్న జిల్లా అధికారులు

ఆంధ్రజ్యోతి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలోని అరిపిరాల గ్రామానికి రూ.4.84 లక్షల విలువ గల సిమెంట్, స్టీల్‌ను విడుదల చేశారని పీఆర్ అధికారులు ధ్రువీకరించారు. ఈ గ్రామంలో కనీసం నిర్మాణం చేపట్టలేదని సామాజిక తనిఖీల్లో గుర్తించారు. పోలుకొండ గ్రామంలో మూడు నిర్మాణాల కోసం సిమెంట్, స్టీల్ నిమిత్తం రూ.3.71 లక్షల నిధులను వినియోగించుకున్నట్లు పంచాయితీ రాజ్ అధికారులు ధ్రువీకరించారు. సదరు సిమెంట్ ఎక్కడికి వెళ్లిందో, మిగిలిన నిధులు ఏమయ్యాయో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. పుట్టగుంట గ్రామంలో నిర్మాణాల పేరుతో 2021లో విడుదల చేసిన 1300 సిమెంట్ కట్టలు ఏమయ్యాయో పంచాయితీరాజ్ అధికారులు తెలపడం లేదు. వాటిని పంచాయితీరాజ్ ఇంజనీర్లు, అప్పటి వైసీపీ నాయకులు కుమ్మక్కై తరలించుకుపోయారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

సామాజిక తనిఖీలో గుట్టురట్టు

2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం ద్వారా సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనికి గాను నందివాడ మండలం అరిపిరాల గ్రామ సచివాలయ నిర్మాణానికి స్టీల్ నిమిత్తం రూ.2,39,693 అడ్వాన్స్ పేమెంట్‌గా తీసుకున్నారని 2022 సామాజిక తనిఖీల్లో తేల్చారు. వారం వ్యవధిలో పనిని ప్రారంభించాలని లేని పక్షంలో నిధులను రికవరీ చేయాలని అప్పటి పంచాయితీరాజ్ ఏఈకి అప్పటి డ్వామా ఏ.పి.డి ఆదేశాలిచ్చారు. మూడేళ్లు కావస్తున్నా నేటికి నిర్మాణం ప్రారంభం కాలేదు, నిధులు రికవరీ చేయడంలో అధికారులు అలసత్వం చూపారు. వైసీపీ నాయకుల అవినీతిలో పంచాయితీరాజ్ అధికారులకు కూడా సంబంధం ఉండటంతో విచారణ ముందుకు సాగడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.


పోలుకొండలో సచివాలయ నిర్మాణ స్థలం

తవ్వేకొద్దీ వెలుగులోకి..

అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.36 లక్షలు, గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలోని మూడు గ్రామాల్లో రూ.11 లక్షల ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు. నందివాడ మండలంలో పుట్టగుంటలో 1300 సిమెంట్ కట్టలు మాయం చేశారు. మిగిలిన గ్రామాల్లో తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. నేటికి లెక్కలు తేలలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పూర్తి స్థాయి విచారణ చేపడితే కోట్ల రూపాయల అవినీతి బయటపడే అవకాశం ఉంది.

విచారణ జరిపి ఐదు నెలలు గడుస్తున్నా..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరిగిన అవినీతిపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేసి రూ.36 లక్షలు విలువ గల ఇనుమును స్వాహా చేసినట్లు విచారణ అధికారులు తేల్చారు. పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపి ఐదు నెలలు కావస్తోంది. ఈ వ్యవహారంలో పంచాయితీ రాజ్ ఏఈల పాత్ర స్పష్టమవ్వడంతో వారందరిని జిల్లా కార్యాలయానికి బదిలీ చేసి కూర్చోపెట్టి నెలనెలా జీతాలు చెల్లిస్తున్నారు. కానీ వారిపై చర్యలు ఉపక్రమించలేదు.

ఒక్క పైసా జమకాలేదు

సామాజిక తనిఖీల్లో సిమెంట్, స్టీల్ నిమిత్తం తీసుకున్న అడ్వాన్స్‌లు ఎక్కడా తిరిగి ఉపాధి హామీ ఖాతాల్లో జమ అయిన దాఖలాలు లేవు. ఈ విషయమై అధికారులను గత ఏడాది మేలో ప్రశ్నించగా, పంచాయితీలకు చెందిన స్పెషల్ ఖాతాల్లో నగదు ఉందని, దానిని రెండు రోజుల వ్యవధిలో ఆర్.డి(రూరల్ డెవలప్‌మెంట్), విజయవాడ ఖాతాల్లోకి జమ మిగతా 6లో..

అవినీతి సఖి

విజయవాడ ప్రభుత్వాస్పత్రి సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అక్రమాలు

గత వైసీపీ హయాంలో రెచ్చిపోయిన పీడీ!

- పోస్టుల దగ్గర నుంచి సేవల వరకు అన్నింటికీ వసూలే..
- బాధిత మహిళల రక్షణ గాలికి.. వారి భర్తలకు ఫిర్యాదు కాపీల చేరవేత
- భారీగా ఫోన్‌పేల ద్వారా నగదు వసూలు
- బాధిత మహిళల ఫిర్యాదులతో నాడు విచారణ కమిటీ.. నేటికీ చర్యలు శూన్యం
- కూటమి ప్రభుత్వంపైనే బాధితుల ఆశలు

ప్రభుత్వ ఆస్పత్రిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతిమయం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధిత మహిళలకు సాయం దగ్గర నుంచి పోస్టుల భర్తీ వరకు ప్రతి పనిలోనూ పీడీగా పనిచేసిన అధికారి వసూళ్లకు పాల్పడ్డారని విమర్శలు ఉన్నాయి. బాధిత మహిళలకు రక్షణగా ఉండాల్సిన వీరు వారి భర్తలకు సాయం చేస్తూ కేసులు వీగిపోయేలా చేశారనే ఆరోపణలు సైతం ఎదుర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించి.. విచారణ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకోకుండా వదిలేసిందని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆపదలో ఉన్న మహిళలు మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181కు ఫోన్ చేసినపుడు సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో ఆ మహిళలకు రక్షణ కల్పించి వారికి వైద్య సహాయం, లీగల్ సహాయం వంటివి అందించాలి. పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. బాధితులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఇలా ఆపదలో ఉన్న మహిళలకు ఎంతో విలువైన సేవలందించాల్సిన విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్ బాధిత మహిళలకు రక్షణ కల్పించకపోగా వారినే భక్షించేలా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు ఉన్న అధికారిణి ఒకరు పీడీగా ఇక్కడ చక్రం తిప్పారు. అనేక అవినీతి ఆరోపణలపై చివరకు ఆమె సస్పెండ్ కూడా అయ్యారు.

ఇష్టారాజ్యంగా నియామకాలు

ఆవిడ చేసిన అక్రమాల్లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్, కేస్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, మల్టీపర్పస్ వర్కర్లకు సంబంధించి నియామకాలు కూడా ఒకటి. దీనికి సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ నియామకానికి బేరసారాలు జరిగాయని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ పోస్టు భర్తీ తప్ప మిగిలిన పోస్టులను భర్తీ చేశారు. ఈ మిగిలిన పోస్టులను కూడా కొందరికి అర్హతలు లేని, అనుభవం లేని వారికి, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు మిగతా 6లో..

అభివృద్ధి ప్రణాళికేది?

మత్స్యకారుల జీవన విధానం మార్చేందుకు ఏం చర్యలు తీసుకున్నారు

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకుంటే ఎలా?

- దిశ సమావేశంలో అధికారులను నిలదీసిన ఎంపీ బాలశౌరి
- వివిధ శాఖలపై సమీక్షలో అధికారులపై అసహనం
- సకాలంలో జాతీయ రహదారుల విస్తరణపై సర్వేలు పూర్తి చేయాలి
- ఎదురుమొండి వంతెనకు నాబార్డు ద్వారా రూ.100 కోట్లు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, చిత్రంలో మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, కృష్ణప్రసాద్, కుమార్ రాజా, జడ్పీ చైర్‌పర్సన్ హారిక తదితరులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : తీర ప్రాంతంలోని మత్స్యకారుల జీవన విధానాన్ని మార్చేందుకు, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రణాళికలు రూపొందించాలని ఎన్నిసార్లు చెప్పినా ఈ ప్రతిపాదనలను ఇంత వరకు ఏ కారణంతో సిద్ధం చేయలేదని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అధికారులను నిలదీశారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జడ్పీ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లాకు చెందిన శాసన సభ్యులతో కలిసి ఎంపీ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ అధ్యక్షతన జరిగి ఈ సమావేశంలో బాలశౌరి మాట్లాడుతూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మత్స్యశాఖపై సమీక్షలో జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకునేందుకు వాహనాలు, వలలు, ఐస్‌బాక్సులు, రుణాల మంజూరు తదితర అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆ పథకాలను అమలు చేసేందుకు నిధులు తీసుకువస్తానని పదేపదే తాను చెప్పినా పట్టించుకోకపోతే ఎలా అని మత్స్యశాఖ అధికారులు, కలెక్టర్‌ను ఎంపీ నిలదీశారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం మీరు తయారు చేసిన ప్రతిపాదనలు ఎన్ని, వాటిలో ఎన్ని యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారో తెలియజేయాలన్నారు. 820 యూనిట్లను అందజేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా, 160 యూనిట్‌లను ఇచ్చామని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని, రూ.2.60కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని మత్స్యశాఖ అధికారులు తెలిపారు, నిధులు ఉన్నా ఏ కారణంతో మత్స్యకారులకు యూనిట్‌లను అందజేయలేకపోతున్నారని, ఎంత కాలానికి వీటిని లబ్ధిదారులకు అందజేస్తారని ఎంపీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వకపోతే ఎలా?

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణపరిమితిని కేంద్ర ప్రభుత్వం పెంచిందని, జిల్లాలో ఎంతమంది కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, గుర్తింపు కార్డులు ఇచ్చారని వ్యవసాయశాఖ అధికారులను బాలశౌరి ప్రశ్నించారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని, ఈ అంశంపై తనకు మిగతా 6లో..

కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగించండి: మంత్రి కొల్లు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను సక్రమంగా వినియోగించేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో కలంకారీ, గోల్డ్ కవరింగ్, ఆటోనగర్, మత్స్యసంపద ఆధారంగా పరిశ్రమలు అభివృద్ధి చేస్తామని, బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేయాలని కోరారు. నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం మండలాల్లో అవుట్‌పాల్ స్లూయిస్‌లకు కనీస మరమ్మతులు చేయించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీ సీఈవో దిశ కమిటీలో నామినేటెడ్ సభ్యులను ప్రకటించారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్ సీజీఎం సుజయ్‌మల్లిక్, ఎస్‌బీఐ జీఎం శైలేష్‌కుమార్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ జీఎం దీపక్‌కుమార్ శ్రీవాత్సవ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం సీతారామారావు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ డీజీఎం అమిత్‌కుమార్‌శుక్లా, యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ డీజీఎం శ్రీకాంత్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం వి.సతీష్, నాబార్డు జీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులపై ఆరా!



ఐదేళ్లుగా అప్‌డేట్ కాని రికార్డులు

ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ఎస్‌బీ

- విజయవాడలో 148 మంది ఉన్నట్టు లెక్కలు
- వారెక్కడున్నారో తెలియక తలలు పట్టుకుంటున్న పోలీసులు

విదేశీలు ఎంతమంది ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు? వాస్తవంగా వాళ్లంతా ఇక్కడ ఉన్నారా? ఒకవేళ ఉంటే ఏ చిరునామాలో ఉంటున్నారు? అంటే సమాధానం దొరకడం ప్రస్తుతం చాలా కష్టంగానే మారింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రికార్డులను అప్‌డేట్ చేయకుండా వదిలేశారు. ఫలితంగా ఇప్పుడు పోలీస్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విదేశీ విద్యార్థులు ఎంతమంది విద్యాభ్యాసం చేస్తున్నారో లెక్కలు మాత్రమే ఉన్నాయి. ఆ విద్యార్థులంతా ఎక్కడున్నారంటే మాత్రం దిక్కులు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఐదేళ్ల కాలంలో అనాథలుగా వదిలేసిన విదేశీయుల రికార్డులను అప్‌డేట్ చేసే పనిలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు. వివిధ దేశాల నుంచి విజయవాడకు ప్రతినిధులు వస్తుంటారు. వివిధ ప్రాజెక్టులపై వచ్చే వారు కొంతమంది ఉంటారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం వచ్చే వారు మరికొంతమంది ఉంటారు. ఈ రెండు కాకుండా పర్యాటక ప్రదేశాలను వీక్షించడానికి కొంతమంది వస్తుంటారు. ఈ మూడు కేటగిరీలో కంటే మొదటి రెండు కేటగిరీల్లో వచ్చే విదేశీయులు ఎక్కువగా ఉంటారు.

సమాచార సేకరణ ఏది?

విజయవాడకు చుట్టుపక్కల ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయి. వాటిలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆఫ్రికా దేశాల నుంచి విద్యార్థులు ఎడ్యుకేషన్ వీసాపై వస్తుంటారు. ఇబ్రహీంపట్నంలో ఉన్న నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటారు. ఇవి కాకుండా గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్‌యూలో మరికొంతమంది వివిధ కోర్సుల్లో చేరతారు. ఇలా విద్యాసంస్థల్లో చేరిన మిగతా 6లో..

వచ్చే ఏడాది ఆఖరుకు బందరు పోర్టు పూర్తి

- పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి రవీంద్ర
- అధికారులతో పనులు సమీక్షించిన కలెక్టర్ బాలాజీ
- రూ.164 కోట్లతో డ్రెయిన్ల అభివృద్ధికి అంచనాలు 8లో

జస్టిస్ రవినాథ్ తిలహరికి ఘన స్వాగతం 6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-23 (ఆదివారం సాయంత్రం)
సహర్ : 04-49 (సోమవారం ఉదయం)

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

- జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులకు గాయాలు
- వైజ్ఞానిక యాత్రకు వెళ్లి వస్తుండగా ప్రమాదం..
- ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు వద్ద ఘటన 6లో

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.14 లక్షల విలువైన 13.5 కేజీల వెండి, బంగారం, రెండు కార్లు రికవరీ 8లో

సేవా రంగంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మరో ముందడుగు 6లో

పెదకళ్లేపల్లిలో తాగునీటి కష్టాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- కృష్ణాజిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులకు గాయాలు
- వైజ్ఞానిక యాత్రకు వెళ్లి వస్తుండగా ప్రమాదం.. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు వద్ద ఘటన
- వెంటనే ఒంగోలు వెళ్లిన డీఈవో..గాయపడిన వారికి చికిత్స అందించి, స్వస్థలాలకు తరలిస్తున్న అధికారులు


ఉప్పు గుండూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

నాగులుప్పలపాడు/మచిలీపట్నం/పామర్రు /నాగాయలంక /గుడివాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశంజిల్లా నాగులుప్పాడు మండలం ఉప్పుగుండూరు వద్ద ఆగి ఉన్న లారీని ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులకు గాయాలయ్యాయి. ఈనెల 19న జిల్లా నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలకు తమిళనాడు, తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. అరుగొలను, గుడివాడ, నాగాయలంక, పెదపులిపాకకు చెందిన ఆరుగురు విద్యార్థులు, మొవ్వ, పామర్రుకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయినులు గాయపడ్డారని డీఈవో వీవీజే రామారావు తెలిపారు. ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే డీఈవో ఒంగోలుకు వెళ్లారు. గాయపడిన వారికి చికిత్స చేయించి, ప్రత్యేక వాహనంలో స్వస్థలాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గాయాలు కాగా, ఉపాధ్యాయినులకు వెన్నెముకకు గాయాలయ్యాయన్నారు.

పామర్రు హైస్కూల్ ఉపాధ్యాయురాలికి రిమ్స్‌లో చికిత్స

ప్రమాదంలో గాయపడిన కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్సు ఉపాధ్యాయురాలు రావి లక్ష్మీకుమారి(61) ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పామర్రు నుంచి వెళ్లిన ఇద్దరు విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షేమంగా ఇంటికి చేరుకుంటున్నారు. ప్రమాదం తనను ఆవేదనకు గురిచేసిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు.

తలగడదీవి విద్యార్థి కోలా లాస్యకు స్వల్ప గాయం

వైజ్ఞానిక యాత్రకు నాగాయలంక నుంచి నలుగురు విద్యార్థులు, తలగడదీవి నుంచి ఇద్దరు వెళ్లారు. వారిలో తలగడదీవికి చెందిన కోలా లాస్యకు కాలికి స్వల్ప గాయమైంది. ప్రథమ చికిత్స చేశాక, అందరూ నాగాయలంక సురక్షితంగా వస్తున్నారని ఎంఈవో రామదాసు తెలిపారు.

గుడివాడ ఏకేటీపీ విద్యార్థినికి కాలికి స్వల్ప గాయం

ఏకేటీపీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వగురు హైమావతి కుడికాలి యాంకిల్‌కు స్వల్ప గాయమైంది. మరో విద్యార్థిని అబ్దుల్ ఆసియా బేగం ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. హైమావతికి ప్రథమ చికిత్స చేశారు. వీరిద్దరిని గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి తన కారులో గుడివాడకు తీసుకొచ్చారు.

జస్టిస్ రవినాథ్ తిలహరికి ఘన స్వాగతం


కృష్ణా జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బెల్ అతిథి గృహానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరికి శనివారం ఉదయం కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు ఘన స్వాగతం పలికారు. మొక్కలు అందజేశారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయాధికారి ఎ.సత్యానంద్, శ్రీదేవి, ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ రాజా, తహసీల్దార్ మధుసూదనరావు, ఆర్డీవో స్వాతి, మచిలీపట్నం న్యాయస్థానాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.వేణు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

బందరులో అదనపు కోర్టులు ఏర్పాటు చేయాలి

- జస్టిస్ రవినాథ్ తిలహరికి బార్ అసోసియేషన్ వినతి

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నంలో అదనపు కోర్టులను ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరికి బెల్ గెస్ట్‌హౌస్‌లో బార్ అసోసియేషన్ నేతలు వినతిపత్రం అందించారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో కో ఆపరేటివ్ ట్రిబ్యునల్, ఫ్యామిలీ, ఏసీబీ, కమర్షియల్, క్యాంపు కోర్టులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రవినాథ్ తిలహరిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిద్ధినేని శ్రీసత్యసాయిబాబు, న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ, అజ్మతున్నీసా, అడపా మురళి, కమ్మిలి విజయకుమార్, లంకిశెట్టి బాలాజీ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ, సువెన్ ఫార్మా ప్రతినిధులు

సేవారంగంలో స్వర్ణభారత్‌ట్రస్ట్ మరో ముందడుగు

- సువెన్ ఫార్మా, ఎల్‌ఎస్ఎస్ఎస్‌డీసీల సహకారంతో ఫార్మా తయారీ రంగంలో ఉచిత నైపుణ్య శిక్షణకు శ్రీకారం

ఉంగుటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు స్వయంఉపాధికి చేయూతనందిస్తున్న ఆత్కూరులోని స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడచాప్టర్)తన సేవలను మరింత విస్తృత పరుస్తోంది. ప్రముఖ మందుల తయారీకంపెనీ సువెన్ ఫార్మా(హైదరాబాద్), కేంద్రప్రభుత్వసంస్థ లైఫ్ సైన్సెస్ సెక్టోరల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ)భాగస్వామ్యంతో ట్రస్ట్ నూతనంగా ఫార్మా స్యూటికల్ రంగంలోకి అడుగుపెట్టింది. రసాయన, వైద్యశాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరుమీద ట్రస్ట్ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఫార్మా తయారీ నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఏప్రిల్ మొదటి వారం నుంచి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. సువెన్‌ఫార్మా, ఎల్‌ఎస్‌ఎస్‌ఎస్‌డీసీ ప్రతినిధుల బృందం శనివారం స్వర్ణభారత్‌ట్రస్ట్‌ను సందర్శించింది. ఫార్మా తయారీ నైపుణ్య శిక్షణ సంస్థను పరిశీలించింది. ఫార్మారంగంలో ఉచిత నైపుణ్య శిక్షణను తొలిసారిగా స్వర్ణభారత్‌ట్రస్ట్ వేదికగా ప్రారంభిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఎంట్రన్స్ పరీక్షద్వారా శిక్షణార్థులను ఎంపిక చేస్తామన్నారు.

1నుంచి కెమిస్ట్ ప్రొడక్షన్ కోర్సులో ఉచిత శిక్షణ

డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ఫార్మా మ్యానుఫాక్చరింగ్ స్కిల్ సెంటర్‌లో ఏప్రిల్ 1నుంచి కెమిస్ట్ ప్రొడక్షన్(ఫార్మా, కాస్మెటిక్స్, బయోలాజిక్స్)కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి తెలిపారు. బీఎస్సీ/ఎంఎస్సీ(కెమిస్ట్రీ), బీ.ఫార్మా/ఎం.ఫార్మా, బీటెక్/పాలిటెక్నిక్(కెమికల్)లో 2022, 23, 24లో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. కోర్సు మూడునెలలుంటుందని, ఎంపికైన అభ్యర్థులకు భోజనం, హాస్టల్ సౌకర్యం ఉచితమన్నారు. ఈనెల 26వతేదీలోపు విద్యార్హతల ధ్రువీకరణపత్రములు, ఆధార్‌కార్డ్, వార్షిక ఆదాయం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతోపాటు ఆరు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో నేరుగా కేంద్రానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7842770270లో సంప్రదించాలని సూచించారు.



అడుగంటుతున్న మంచినీటి చెరువు, పాడైపోయిన ఫిల్టర్ బెడ్

పెదకళ్లేపల్లిలో తాగునీటి కష్టాలు

ఫిల్టర్ చేయకుండానే చెరువు నుంచి కుళాయిలకు నీరు విడుదల

- చేతి పంపులపై ఆధారపడుతున్న గ్రామస్థులు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న ఫిల్టర్ బెడ్ల ఏర్పాటు



మురికిగా వస్తున్న కుళాయి నీరు, ఆకుపచ్చగా ఉన్న నీటిని చూపుతున్న మహిళలు

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి): మండలంలోని అతి పెద్ద పంచాయతీ పెదకళ్లేపల్లి. గ్రామంలో 1000 కుటుంబాలు ఉన్నాయి. గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగెకరాల విస్తీర్ణంలో చెరువు ఉన్నప్పటికీ ఫిల్టర్ బెడ్లు పని చేయడం లేదు. దీంతో నేరుగా చెరువు నీటినే కుళాయిలకు వదులుతున్నారు. చెరువులోనే కలుషితమైన నీరు కుళాయిల ద్వారా వచ్చాక దుర్వాసన వస్తోంది. పశువులు తాగేందుకైనా ఉపయోగపడని నీరు కుళాయిల ద్వారా వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. వేసవి కాలం ప్రారంభం కావటంతో చెరువులో నీరు అడుగంటడంతో గ్రామస్థులు మరింత ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా నాంది ఫౌండేషన్‌కు నీరు సరఫరా అవుతోంది. నాంది ఫౌండేషన్ వద్ద కొందరు నీటిని కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు. గ్రామ శివారుల్లో ఉన్న చేతి పంపులు, బోరుబావులను గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా వచ్చే నీటిని తాగునీటికి, ఇంట్లో అవసరాలకు ఉపయోగించటం మానేశామని చెబుతున్నారు. స్నానం చేస్తే దద్దుర్లు, అంటువ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు.

పదిహేనేళ్ల నుంచి ప్రతిపాదనలు పంపుతున్నా..

రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల వ్యవహారం పదిహేనేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. 2006లో ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేశారు. నాటి నుంచి ఫిల్టర్ బెడ్ల ఏర్పాట్లు, మరమ్మతులకు ఏటా పది లక్షల అంచనా వేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పంపుతున్నారు. 2023లో రూ.12లక్షలతో ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేశారు. మంజూరయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షలతో మరో అంచనా తయారు చేసి ఎంపీ వల్లభనేని బాలశౌరికి పంపారు. మంజూరు చేయగా, టెండర్లు పిలిచే దశలో ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. నాలుగు పర్యాయాలు అంచనాలు తయారు చేసి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు ఉన్నతాధికారులు, నాయకుల వద్దకు పంపగా, ఎన్నికల కోడ్, ఇతర సమస్యలో నిలిచిపోవటంతో అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతలు వేసిన పంపులే ఆధారం



గ్రామ శివారుల్లో దాతలు వేసిన చేతి పంపుల వద్ద ఎక్కువ మంది మంచి నీరు తెచ్చుకుంటున్నారు. మెంతి దిబ్బ, పెదకళ్లేపల్లి నుంచి కుమ్మరిపాలెం వెళ్లే రహదారి, మేళ్లమర్రు రహదారుల్లో పంచాయతీ వారు, పలువురు దాతలు పొలాల వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపులు గ్రామస్థుల మంచినీటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. ప్రధాన గ్రామం నుంచి 2 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు.

కుళాయిల్లో నీరు దుర్వాసన వస్తోంది



పదేళ్ల నుంచి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులను అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. గ్రామానికి వచ్చినపుడు మంచినీటి సమస్య ప్రస్తావించగా, అంచనాలు వచ్చాయంటూ కాలం దాటవేస్తున్నారు. గ్రామ శివారుల్లో దాతలు ఏర్పాటు చేసిన చేతి పంపులపై ఎంతకాలం ఆధార పడాలి. అధికారులు మంచినీరు కూడా అందించలేకపోతున్నారు. కుళాయిల్లో నీరు పసరుగా ఉంది. మురుగునీరులా వచ్చి దుర్వాసన వేస్తోంది.

- కాలారి రామారావు, గ్రామస్థుడు

చెరువును శుభ్రం చేయాలి



గ్రామానికి మంచినీరు అందిస్తున్న చెరువు అపరిశుభ్రంగా ఉంది. నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. చెరువును శుభ్రం చేసి గ్రామప్రజల అవసరాలకు తగినంత మంచినీటిని అందించాలి.

-గంధం చలపతిరావు, గ్రామస్థుడు

అంచనాలు రూపొందించాం



గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి ఫిల్టర్ బెడ్లు నూతనంగా ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్, ఎంపీ వల్లభనేని బాలశౌరి దృష్టికి తీసుకెళ్లాం. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేదిశగా ప్రయత్నిస్తున్నాం.

-అరజా సంధ్యారాణి, సర్పంచ్


కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఉన్న ఆక్రమణలు

ఆక్రమణల తొలగింపులో జాప్యమేల

- హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి): అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా కూచిపూడిని అభివృద్ధిపర్చేందుకు బస్టాండ్ చుట్టూ ఆక్రమణలు అడ్డంకిగా ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. సర్వే నెంబర్ 38/1, 38/2లో బస్టాండ్ చుట్టూ ఉన్న స్థలాన్ని ఆక్రమించి 42 దుకాణాలను ఆక్రమణదారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా మూడొంతులకు మందికి పైగా దుకాణాలను వేరే వారికి అద్దెలకు ఇచ్చారు. పది మంది లోపే సొంత దుకాణదారులు వ్యాపారాలు చేస్తున్నారు. కూచిపూడి పంచాయతీవారు ఆక్రమణ తొలగింపుపై చర్యలు తీసుకోవాలని హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి 15 రోజుల్లోగా ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వటంతోనే కాలయాపన చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలిచ్చి ఏడాది కావొస్తోంది. అయినా అధికారులు ఆక్రమణలు తొలగించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆక్రమణలు తొలగించి ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇప్పుడు దుకాణాలు నడుపుకొంటున్న వారికే తక్కువ ధరకు లీజుకు ఇవ్వాలని పంచాయతీ భావిస్తోంది. దుకాణదారులు స్టే తెచ్చుకునే విధంగా అధికారులు వారికి సహకరిస్తూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే గ్రామం అభివృద్ధి చెందటమే కాకుండా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాజకీయ నాయకుల జోక్యం కూడా ఆక్రమణల తొలగింపులో జాప్యానికి మరో కారణం అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నోటీసులు ఇచ్చి తొలగిస్తాం

ఇటీవల వరకు ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున ఆక్రమణల తొలగింపులో జాప్యం జరిగింది. రెండు రోజుల్లో మరోమారు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి హైకోర్టు ఆదేశాల మేరకు దుకాణాల తొలగింపునకు చర్యలు చేపడతాం.

- పుష్పనాథం, పంచాయతీ కార్యదర్శి

అవినీతి సఖి


సామాజిక తనిఖీలో స్టీల్ పేరుతో అడ్వాన్స్ పేమెంట్ చేసినట్టు నివేదిక

(5వ పేజీ తరువాయి)

కూడా చూపలేని వారికి ఇచ్చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారాల కారణంగా.. సఖి వన్‌స్టాప్ సెంటర్ కాస్తా అవినీతి అక్రమాలమయంగా మారిపోయింది.

బాధితులకు నరకమే!

సఖికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టు భర్తీ కాకపోవటంతో ఈ పోస్టును మరొకరికి ఇన్‌చార్జిగా ఇచ్చారు. అప్పటి నుంచి ఈ కేంద్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు అన్నీ, ఇన్నీ కాకుండా ఉంటున్నాయి. బాధిత మహిలకు సహాయం చేయాల్సింది పోయి.. వారికే నరకం చూపించే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎందరో మహిళా బాధితులు ఈ సెంటర్‌కు వచ్చినందుకు కన్నీళ్లు పెట్టుకోవాల్సి వచ్చింది. బాధిత మహిళలు చేసే ఫిర్యాదులను ఇక్కడ వారు వారి భర్తలకు చేరవేయటం.. తద్వారా వారి నుంచి డబ్బులు తీసుకోవటమనే సంస్కృతి ప్రబలిపోయిందని పలువురు ఆరోపించారు. రాను రానూ మరింత పరాకాష్ఠకు చేరుకుంది. భార్యలకు తెలియకుండా వారి ఫిర్యాదు కాపీలను భర్తలకు ఇవ్వటం, భర్తలకు తెలియకుండా వారి ఫిర్యాదు కాపీలను భార్యలకు ఇవ్వటం, సరైన లీగల్ గైడెన్స్ ఇవ్వకపోవటం, ఫిర్యాదు కాపీలు ఒకరివి ఒకరికి మార్చటం ఇలా అత్యంత దారుణంగా ప్రవర్తించారని విమర్శలు వచ్చాయి. ఇలా చేసి అనేక రకాలుగా లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి.

విచారణకు ఆదేశించినా..

ఈ వ్యవహారాలపై పలువురు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయగా.. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే విచారణకు కూడా ఆదేశించారు. విచారణాధికారిని నియమించారు. ఆయన నివేదికను కూడా ఇవ్వటం జరిగింది. విచారణాధికారి ఇచ్చిన నివేదికను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొక్కిపట్టారు. ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోకపోగా.. ఆరోపణలు వచ్చిన వారికి ఇన్‌చార్జిగా సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టులోనే కొనసాగించటం గమనార్హం. బాధిత మహిళలకు అండగా ఉండాల్సిన సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అందించాల్సిన సేవల పట్ల ఎలాంటి అవగాహన లేనివాళ్లు, సమాజాన్ని నాశనం చేసే విధంగా వ్యవహరించే వాళ్లు ఉండటం దురదృష్టకరమని పలువురు విమర్శించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఉద్యోగినిపై దాదాపుగా 10 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఫిర్యాదులపై ఆధారాలతో సహా నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోవటం లేదని తెలిసింది. ఆ ఉద్యోగిని ఫోన్‌ను తనిఖీ చేస్తే ఎవరెవరితో ఫోన్ కాల్స్ మాట్లాడటం జరిగింది? ఎవరెవరి నుంచి తన ఖాతాకు డబ్బులు జమ అయ్యాయన్నది తేలుతుందని బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టి సారించి విచారణ కమిటీని ఏర్పాటు చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే అర్హతల ప్రకారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టును భర్తీ చేయటంతో పాటు మిగిలిన పోస్టుల్లో కొనసాగుతున్న అనర్హులను ఏరివేసి నిబంధనల ప్రకారం అర్హులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

నిధులు దిగమింగినా చర్యల్లేవు..!

(5వ పేజీ తరువాయి)

చేయిస్తామని పీఆర్ అధికారులు తేల్చి చెబుతున్నారు. రెండు రోజుల మాట చెప్పి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క పైసా కూడా ఆర్.డి ఖాతాలోకి జమకాలేదు.

ఎమ్మెల్యే వెనిగండ్ల మాట బేఖాతరు

నందివాడ మండలంలో సిమెంట్, స్టీల్ పేరుతో మాజీ మంత్రి కొడాలి నాని అనుచరులు, పంచాయితీ ఏఈ, మండల పరిషత్ అధికారులు కుమ్మక్కై లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారని ఇటీవల నందివాడ మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సదరు వ్యక్తులపై కేసులు పెట్టి, ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని మండల పరిషత్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్యే ఆదేశించి 4 నెలలు గడుస్తున్న అధికారులు సదరు సిమెంట్, స్టీల్ స్వాహా స్కాంలో ఒక్క అడుగు కూడా విచారణ ముందుకు సాగలేదు. ఎమ్మెల్యే వెనిగండ్ల ఆదేశాలను సైతం తుంగలో తొక్కి మండల పరిషత్ అధికారులు వైసీపీ నాయకులకు అండగా నిలిచారనే విమర్శలు ఉన్నాయి.

అభివృద్ధి ప్రణాళికేది?

(5వ పేజీ తరువాయి)

అనేకమంది ఫిర్యాదు చేశారని, ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని కోరారు. కౌలు రైతులకు జిల్లాలో 65 వేల కార్డులు ఇచ్చామని, ఈ ఏడాది మరో 20 వేల మందికి ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామని వ్యవసాయశాఖ అధికారులు సమాధానమిచ్చారు. భూమి యజమానులు ముందస్తుగానే పంట రుణాలు తీసుకోవడంతో కౌలురైతులకు రెండోసారి అదే భూమిపై పంట రుణం అందించేందుకు బ్యాంకు అధికారులు అంగీకరించడం లేదని వ్యవసాయశాఖ జేడీ మనోహరరావు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయం చేసుకుని కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ కోరారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు రుణాలు ఇవ్వాలి

లాభాల్లో ఉన్న అన్ని వాణిజ్య బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే నిరుద్యోగులు, రైతులకు రుణాలు మంజూరు చేయకుండా విస్మరిస్తున్నాయన్నారు. చిన్నపాటి పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకునేందుకు వారికి రుణాలు ఇవ్వాలని కోరారు. పోర్టు నిర్మాణ పనులు పూర్తయితే పోర్టు ఆధారిత పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు అవుతాయని, పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చిన యువతకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. త్వరలో జిల్లాలో రుణమేళాను నిర్వహిస్తున్నామని ముద్ర, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా రూ.50 వేల నుంచి 100 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎదురుమొండి వంతెన నిర్మాణానికి రూ.100 కోట్లను నాబార్డు నుంచి గతంలో మంజూరు చేయించినా, వివిధ కారణాలతో పనులు జరగలేదని, ఈ ప్రతిపాదలను మళ్లీ పునరుద్ధరించి నిధులు విడుదల చేయాలని నాబార్డు జీఎంను కోరారు. నాబార్డు వద్ద క్లైమేట్ చేంజ్ ఫండ్స్ ఉంటాయని, ఉదారంగా ఈ నిధులను జిల్లాలోని సముద్ర తీరం వెంబడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించాలని చెప్పారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎంపీ నిధుల నుంచి రూ.2కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసేందుకు, నిర్మాణాలు నిలిచిపోయిన పీహెచ్‌సీలలో పనులు పూర్తి చేసేందుకు నివేదికలు తయారు చేసి తనకు ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్టను ఎంపీ బాలశౌరి సూచించారు.

విదేశీ విద్యార్థులపై ఆరా!

(5వ పేజీ తరువాయి)

వాళ్లంతా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో ఐవీఎఫ్ఆర్టీ (ఇమిగ్రేషన్ వీసా ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్) విభాగంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. వారు ఏ విద్యాసంస్థలో చదువుతున్నారు, ఏ గ్రూపులో అడ్మిషన్ తీసుకున్నారు, వసతి ఎక్కడ తీసుకున్నారు అన్న వివరాలను ఈ ఐవీఎఫ్ఆర్టీలో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఆ విద్యార్థులపై స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిఘా ఉంచుతారు. వారి కదలికలను గమనిస్తుంటారు. ఈ విద్యార్థులు కాకుండా వివిధ ప్రాజెక్టుల పనులపై కొంతమంది విదేశీయులు ఇక్కడికి వస్తుంటారు. వాళ్లంతా స్టార్ హోటళ్లలో బ చేస్తారు. వారికి సంబంధించిన వివరాలను ఐవీఎఫ్ఆర్టీ సిబ్బంది సేకరిస్తారు. వారు హోటళ్లలో దిగింది మొదలు తిరిగి విమానం ఎక్కే వరకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఉన్నతాధికారులకు పంపుతారు. హోటళ్లలో దిగిన తర్వాత రిసెప్షన్‌లో ఫారం 'సీ'ని విదేశీయులకు ఇస్తారు. దాన్ని వారు పూర్తిచేసి తిరిగి రిసెప్షన్‌లో ఇస్తారు. ఆ ఫారంను హోటల్ సిబ్బంది స్పెషల్ బ్రాంచ్‌కు పంపుతారు. దీన్నీ అప్పటి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

148 మంది వరకు ఉన్నారని లెక్కలు!

విదేశాల నుంచి ఉన్నత విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు కమిషనరేట్ పరిధిలో 148 మంది వరకు ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి. వారు ఎక్కడున్నారన్నది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విదేశీ విద్యార్థులు కొంతమంది వాటికి సంబంధించిన హాస్టళ్లలో ఉంటారు. మరికొంత మంది బయట బ్యాచిలర్ రూంల్లో ఉంటారు. విద్యాభ్యాసం పూర్తయి సొంత దేశాలకు వెళ్లినా, ఇక్కడి నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినా కచ్చితంగా ఐవీఎఫ్ఆర్టీలో సమాచారం ఇవ్వాలి. ఆ విద్యార్థులు ఇచ్చినా ఇవ్వకపోయినా వారు ఇచ్చిన చిరునామాలను సిబ్బంది నిరంతరం పరిశీలిస్తుండాలి. ఒకవేళ ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారితే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేయాలి. వైసీపీ పాలన సాగిన ఐదేళ్లలో ఈ ప్రక్రియను పడకేబెట్టేశారు. విదేశీ విద్యార్థులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించకుండా వదిలేశారు. రికార్డుల ప్రకారం ఉన్న 148 మందిలో కొంత మంది మాత్రమే కమిషనరేట్ పరిధిలో ఉన్నట్టు తేలింది. మిగిలిన వారి చిరునామాలు తెలియడం లేదు. వాళ్లంతా సొంత దేశాలకు వెళ్లిపోయారా, విజయవాడ నుంచి మరో రాష్ట్రానికి వెళ్లిపోయారా అన్న వివరాలు మాత్రం తేలడం లేదు. దీనితో ప్రస్తుతం ఐవీఎఫ్ఆర్టీ సిబ్బంది ఆ వివరాలు తెలియకపోవడంతో తలలు పట్టుకున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారో తేల్చే పనిలో పడ్డారు. నాడు వైసీపీ హయాంలో అధికారులు వదిలేసిన రికార్డులను అప్‌డేట్ చేస్తున్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు

బాలికపై అత్యాచారం కేసులో మరో నలుగురు అరెస్టు

గన్నవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో మరో నలుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు తెలిపారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కొండేటి అనిల్, ఉయ్యూరు నవీన్ కుమార్, పరస సంజయ్ వర్ధన్, పరస రాజేశ్‌ను అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ఇంతకు ముందు ఇద్దరిని, ఇప్పుడు నలుగురు, ఇద్దరు మైనర్లతో కలిపి ఈ కేసులో ఉన్న 8 మంది నిందితులనూ అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, హనుమాన్ జంక్షన్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్సై చావా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కీసరలో హైడ్రామా

- వైసీపీ నాయకుడి ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు
- గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసుకున్న జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్

కంచికచర్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి భర్త, వైసీపీ సీనియర్ నాయకుడు వేల్పుల రమేష్‌ను అరెస్టు చేసేందుకు కంచికచర్ల పోలీసులు ఆయన ఇంటిని చుట్టుముట్టారు. ఆయన ఇంట్లోనే ఉండి లేడని చెప్పిస్తున్నాడని, నోటీసులు ఇచ్చి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాడని తెలుస్తోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మధిర మండలం బయ్యారం గ్రామానికి చెందిన జోజి అనే మహిళను నిర్బంధించి, తన ఆస్తిని వేరొకరికి బలవంతంగా రాసి ఇప్పించటంలో రమేష్ కీలక పాత్ర పోషించినందుకు అదుపులోకి తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కీసర గ్రామంలో వేల్పుల రమేష్ ఇంటి వద్ద హైడ్రామా నడుస్తోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

బాపులపాడులో పన్ను బకాయిలపై అధికారుల విచారణ

హనుమాన్‌జంక్షన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల పన్ను వసూళ్లలో బాగా వెనుకబడిన బాపులపాడు పంచాయతీపై జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. శనివారం జిల్లా పంచాయతీ కార్యాలయం అధికారి రాజబాబు గ్రామ పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం పెండింగ్ ఉన్న గృహ యజమానులు వద్దకు వెళ్లి విచారించారు. 2013-14లో అప్పటి పాలకవర్గం పెంచిన ఇళ్ల పన్నులను వ్యతిరేకిస్తూ కొంత మంది గృహ యజమానులు పన్నులు చెల్లించడానికి నిరాకరించారు. దీంతో పన్ను బకాయిలు పెరిగాయి. ఇటీవల జనసేన నేత చలమలశెట్టి రమేశ్‌బాబు నాయకత్వంలో 2013-14 ఆర్థిక సంవత్సరంలో పెంచిన ఇళ్ల పన్నుల భారాన్ని తగ్గించాలని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో పన్ను వసూళ్లు మందగించాయి. జిల్లా అధికారుల వెంట ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య, పంచాయితీ కార్యదర్శి పూర్ణేశ్వరి ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

కూటమి నాయకులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపు



పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే మేనెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కూటమి నాయకులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాడిగడప మునిసిపాలిటీకి ఎన్నికలు ఖాయమని, ఎన్నికలు గతంలో నిర్వహించకపోవడంతో కోట్లాది నిధులు కోల్పోయామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మునిసిపాలిటీగా ఆవిర్భవించి నాలుగేళ్లయినా ఇంతవరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల లేమితో మునిసిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలూ శ్రమించాలని పిలుపునిచ్చారు. యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టరు ఇన్‌చార్జిలు గత ఎన్నికలలో ఎలా పనిచేశారో అదే పట్టుదలతో పనిచేయాలని ఆదేశించారు. తాడిగడప మునిసిపాలిటీ పేరు మార్చడానికి ఎనిమిది నెలలు పట్టిందని, ఎంతో శ్రమిస్తేగాని పేరులో మార్పు జరగలేదని, ఇది వ్యవస్థ గురించి తెలియని వాళ్ల గమనించాలని హితవు పలికారు. సోషల్ మీడియాలో ఇలాంటి వారు చేసే వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మునిసిపాలిటీ పేరు మార్పు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ఎండీ ఫరూక్ సతీమణికి ఘననివాళి

పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల మృతి చెందిన రాష్ట్ర మంత్రి ఎండీ ఫరూక్ సతీమణి షెహనాజ్‌కు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ, షెహనాజ్ ఆత్మకు శాంతికలగాలని భగవంతుడిని కోరినట్లు ఆయన తెలిపారు.

బూసిమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉయ్యూరు : ముదునూరులో జరుగుతున్న బూసిమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం అమ్మ వారిని దర్శించి పూజలు చేశారు. అమ్మవారి కరుణ కటాక్షాలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ మండవ జయదేవ్, మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేషవరప్రసాద్, సాయిపురం సర్పంచ్ షేక్ జాన్‌బాషా తదితరులు అమ్మవారిని దర్శించి పూజలో పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యం

పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగ విజయోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం, వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 15వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చానని ఆ దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 7వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, మూతపడిన అశోక్ లేల్యాండ్‌ను పునఃప్రారంభించామని తెలిపారు. 42 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించటం అభినందనీయమన్నారు. వీళ్లని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలన్నారు. హెచ్‌సీఎల్, మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్‌కి పాలి టెక్నిక్ విద్యార్థులను లింక్ చేస్తామని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి అపాయింట్ మెంట్ లెటర్‌లను అందజేశారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ బడుగు బాలమ్మ, ఎంపీడీవో టి.స్వర్ణలత, గ్రామ కార్యదర్శి సరోజిని, ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్, రమేష్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రతినిధి ఎస్.సురేష్‌బాబు, విద్యుత్ టెక్నాలజీ ప్లాంట్ మేనేజర్ వి.భార్గవ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్స్ ఎలీషా ఏవో కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కుంటతో రైతుకు మేలు

రాష్ట్ర రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు





వేలేరులో పంట కుంట తవ్వకాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు.. సాయిపురంలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ షేక్ జాన్ బాషా, ఎంపీడీవో శేషగిరిరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా రైతు పొలాల్లో పంటకుంటలు (ఫార్మ్ పాండ్) తవ్వడంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు వర్షపునీటిని వడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాలు రీచార్జ్ అవుతాయని రాష్ట్ర రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరులోని దోనవల్లి సత్యనారాయణకు చెందిన పొలంలో పంట కుంటల తవ్వకాన్ని శనివారం పూజ చేసి ప్రారంభించారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగుంట.. ప్రతి పొలానికి పంటకుంట ద్వారా వర్షపునీటిని భూమిలోకి ఇంకేలా చేయడం మహత్తరకార్యమన్నారు. గ్రామంలో ఇప్పటికే ఏడు మంజూరయ్యాయని, అసక్తి గల రైతులు ముందుకు వస్తే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో మరిన్ని పంటకుంటలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నార్జీయస్ ఫీల్డ్ సిబ్బంది కారే విజయనిర్మల, మేట్లు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాజ సురేష్, కన్వీనర్ అవిర్నేని భవానిశంకర్, నీటి సంఘ అధ్యక్షుడు గోళ్ల గోపి, పల్లగాని కిషోర్, దోనవల్లి సీతారామప్రసాద్, ధూళిపాళ్ల సాంబయ్య, పొలగాని విజయ్, కోడూరు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సాయిపురంలో..

ఉయ్యూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సాయిపురంలో శివారం పంటకుంటల నిర్మాణానికి సర్పంచ్ షేక్ జాన్‌బాషా, ఎంపీడీవో శేషగిరిరావు భూమిపూజ చేశారు. పంటకుంటల నిర్మాణం వలన భూగర్భ జల వనరులు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో అన్నారు. ఏపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఉప్పలూరు పీహెచ్‌సీకి వాటర్ కూలర్‌ను అందజేస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య తదితరులు

పీహెచ్‌సీకి వాటర్ కూలర్ అందజేత

కంకిపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కి శనివారం ఆయన వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజు, గ్రామ టీడీపీ నాయకులు చలసాని రాధాకృష్ణమూర్తి, కనగాల సుబ్బారావు, కొండవీటి శివయ్య, కొణతం సుబ్రహ్మణ్యం, తాతా వెంకటేశ్వరరావు, లాం సురేష్, పడవల మధుసూదనరావు, లాం బోసు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

గన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రెండు వారాల పాటు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎలీప్ అధ్యక్షురాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో మార్కెటింగ్ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.



పేదల కాలనీలో సమస్యలపై ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు, వణుకూరు పేదల కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపడం లేదని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఖాసీం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా కాలనీల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతర కాలనీల్లో రోడ్లు, తాగునీరు, వీధి లైట్ల సమస్యలు పరిష్కరించాలని పెనమలూరు తహసీల్దారు గోపాలకృష్ణకు వినతి పత్రం అందించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఉయ్యూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో వివిధ పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శనివారం గండిగుంట, చినఓగిరాల, కాటూరు, కలవపాముల పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు బాలగంగాధర్, బి రాజేశ్, సుబ్బారావు పాల్గొన్నారు.

150 మందికి వైద్యపరీక్షలు

ఉయ్యూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రోటరీక్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శనివారం పెదఓగిరాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 150 మందికి నేత్ర, దంత, ఇతర వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం, కేసీపీ జీఎం వీవీ పున్నారావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోటరీ నేత్ర వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపులపాడులో కుక్కల పట్టివేత



హనుమాన్‌జంక్షన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుక్కల సమస్యపై బాపులపాడు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను భయ బ్రాంతులకు గురిచేస్తుండడంతో వాటిని పట్టుకొని దూరంగా వదిలివేసే చర్యలను శుక్రవారం నుంచి నిర్వహిస్తోంది. కుక్కలను ప్రాణాలతో పట్టుకొని దూరంగా వదిలిపెట్టే విధంగా తాడేపల్లి గూడెంకు చెందిన కొంతమంది నిపుణులను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి తెలిపారు. 200 పైగా కుక్కలను పట్టుకున్నట్లు తెలిపారు.

బాపులపాడు మండల సమావేశం 29న

హనుమాన్‌జంక్షన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బాపుపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 29న ఎంపీపీ నగేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సరఫరాను ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంతో పాటు అల్లాపురం, భార్గవినగర్, పామర్తినగర్ రాజీవ్‌నగర్ కాలనీ, విద్యానగర్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనగర్ కాలనీ, బుద్ధవరం రోడ్డు, గౌడపేట ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు.

కూటమి నేతల చిత్రపటానికి పాలాభిషేకం

హనుమాన్‌జంక్షన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ఆమోదించి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా నాయ కులు శనివారం కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రధాని మోదీ, ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అయినంపూడి ఆశీర్వాదం, నాయకులు గండేపూడి నితీష్ కుమార్, పింగళి జోజిబాబు, బొకినాల సాంబశివరావు, పచ్చిగళ్ల శ్రీను, గాలంకి వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించాలి

ఉంగుటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకుంటూ సబ్జెక్టులో మంచి పట్టు సాధించడంద్వారా భవిష్యత్తులో ఆయా రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధిస్తారని ప్రముఖ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ ఒరాకిల్ కంపెనీ (హైదరాబాద్) వైస్ ప్రెసిడెంట్ కె.విశ్వప్రసాద్ అన్నారు. తేలప్రోలులోని ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జీవీకెఎస్‌వీ ప్రసాద్ కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



విశ్వప్రసాద్‌తో కలిసి బహుమతులందజేస్తున్న కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం

మంత్రి లోకేశ్ వద్దకు బీసెంట్‌రోడ్ హాకర్ల పంచాయితీ

● సమస్య పరిష్కరించాలని ఎంపీ శివనాథ్‌కు సూచన

వన్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసెంట్‌రోడ్డులో ఇటీవల కొత్తగా కొందరు హాకర్లు రావడం, అప్పటికే అక్కడున్న హాకర్లు అభ్యంతరం చెప్పడంతో చోటు చేసుకున్న వివాదం మంత్రి నారా లోకేశ్ వద్దకు చేరింది. ఇరువర్గాల వెనుక రాజకీయపార్టీల మద్దతు ఉండడంతో సమస్య క్లిష్టతరంగా మారింది. ఇప్పటికే కిక్కిరిసిన హాకర్లతో షాపుల వారికి ఇబ్బందికరంగా మారింది. మరోవైపు కొత్తగా మరికొందరు వస్తే వినియోగదారులు తిరిగే పరిస్థితి ఉండదని, దీంతో బీసెంట్‌రోడ్డు వ్యాపారుల సంక్షేమ సంఘం నేతలు, విజయవాడ టెక్స్‌టైల్ రెడీమేడ్ రిటైల్ సంక్షేమ సంఘ నేతలు రెండు రోజుల క్రితం నారా లోకేశ్‌ను కలిసి పరిస్థితి వివరించి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఈ బాధ్యతను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి అప్పగించారు. షాపుల వారిని కూడా ఎంపీని కలవాలని సూచించారు. వ్యాపారస్థులు, హాకర్లతో ఎంపీ సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది.


హీరో ప్రదీప్, హీరోయిన్ దీపికకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రదీప్, దీపిక

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిని అమ్మవారిని 'అక్కడ అమ్మాయి, ఇక్కడ అబ్బాయి' చిత్ర బృందం దర్శించుకుంది. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాట్లాడుతూ, అక్కడ అమ్మాయి, ఇక్కడ అబ్బాయి సినిమా ఏప్రిల్ 11న విడుదలవుతోందని, దుర్గమ్మ సన్నిధిలో చిత్ర ప్రమోషన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ ప్రదీప్‌తో కలిసి చిత్రంలో నటించడం సంతోషంగా ఉందన్నారు. తొలుత చిత్ర బృందానికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

మహిళ గొంతు కోసి బంగారం చోరీ

● మహిళ పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు



గొల్లపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెడలోని బంగారు గొలు సు కోసం ఓ మహిళ ప్రాణం తీయబోయాడో దుండగుడు. కొండపల్లి అమెరికన్ హాస్పిటల్ వెనుక ఉన్న ఇంట్లో నివాసముంటున్న జూలూరి బాబ్జీ టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తుంటారు. పై అంతస్తులో ఆయన భార్య రమా (50)పై శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు మెడపై బ్లేడుతో గాయపర్చి బంగారు గొలుసుతో పరారయ్యాడు. భయంతో ఆమె తలుపు గడియ పెట్టుకొని ఇంట్లో ఉండిపోయింది. భర్త ఇంటికొచ్చి తలుపు తీసి చూడగా ఆమె రక్తపు మడుగులో ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమెను చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, ఘటనా స్థలానికి లా అండ్ ఆర్డర్ ఏడీసీపీ గు న్నం రామకృష్ణ, క్రైం ఏడీసీపీ దుర్గారావు, సీఐ చంద్రశేఖర్‌లు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకున్నారు. అడుగడున క్షుణ్ణంగా పరీక్ష చేస్తు న్నారు. బాధితురాలి భర్త బాబ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రహదారికి ఇరువైపులా నిలిపిన భారీ టిప్పర్లు

ఎన్టీటీపీఎస్ అకౌంట్స్ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన నిలిపిన వరికోత యంత్రం, వాహనం

రాష్ట్ర గనులశాఖ ఎదుట నిలిపిన పాడైన లారీ

పార్కింగ్‌తో పరేషాన్..!

పార్కింగ్ ప్రదేశంగా మారిపోయిన ఎన్టీటీపీఎస్ పాత గేటు రోడ్డు

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంక్‌లతో రద్దీ
- ఇరువైపులా పాడైన వాహనాలు, పనుల నిమిత్తం వచ్చే వాహనాల నిలుపుదల
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయం గుప్పెట్లో స్థానికులు
- చెత్త శుద్ధికీ అవరోధమే..!

ఇబ్రహీంపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వీటీపీఎస్ పాత గేటుకెళ్లే రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఎందుకంటే ఈ రోడ్డులోనే ఎస్‌బీఐ, యూనియన్, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెండు ప్రైవేటు స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాల, తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాలు, మైనింగ్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్, రాష్ట్ర గనులశాఖ కార్యాలయం, ఎన్టీటీపీఎస్ క్వార్టర్స్, ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు, ఎన్టీటీపీఎస్ అకౌంట్స్ ఆఫీసులు ఉన్నాయి. అయితే ఈ రోడ్డును కొందరు వ్యక్తులు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. కొందరు వాహనాల యజమానులు తమ టిప్పర్లను పదుల సంఖ్యలో రహదారికి ఇరువైపులా నలిపి ఉంచుతున్నారు. అంతేకా పాడైన వాహనాలను కూడా అక్కడే నిలిపేశారు. ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా కార్యాలయాలకు, బ్యాంకులకు, పాఠశాలలకు వేళ్లేచోట్ల తప్ప మిగిలిన ప్రదేశమంతా కిలోమీటర్ దూరంలో వరుసగా పదుల సంఖ్యలో భారీ వాహనాలు, పాడైన వాహనాలు నిలిపి ఉండటం శోచనీయం. పోలీస్‌స్టేషన్, గనులశాఖ వద్ద నిలిపిన వాహనాలు కేసుల్లో ఇరుక్కొని ఉన్నట్టయితే వాటిని ఎక్కడైనా నిలపాలే కానీ ఇలా రోడ్డు వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా నిలపడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహనాలు నిలిపిన చోట చెత్త సేకరణ కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలున్నాయి. కొన్నిచోట్ల కుండీలు లేవు. దీంతో సమీపంలోని క్వార్టర్స్‌లో ఉండేవారు, నివాసితులు తమ చెత్తను ఆ వాహనాల మధ్యలో వేస్తున్నారు. తర్వాతి రోజున ఆ చెత్తను తొలగించేలోపు కుక్కలు చిందరవందరగా చేస్తున్నాయి. వాటి మధ్యలో నుంచి ఎప్పుడు ఏ కుక్కలు, ఆవులు సడన్‌గా రోడ్డు మీదకు వస్తాయో తెలియని పరిస్థితి. అంతేకాక ఆయా కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చేవారు, రోడ్డు పక్కనే ఉన్న స్కూళ్ల నుంచి వచ్చే విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందో అర్థం కాని పరిస్థితి. రెవెన్యూ అధికారులు కానీ, పోలీస్ అధికారులు కానీ తమకేం పట్టనట్టు చూసుకుంటూ తిరుగుతున్నారే తప్ప వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా నిలిపిన వాహనాలను తొలగించాలని వారు కోరుతున్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపి 20 టైర్ల లారీ

సహజీవనం చేస్తున్న మహిళపై పెట్రోలు పోసి నిప్పు

చిట్టినగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సహజీవనం సాగిస్తున్న మహిళపై అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పు అంటించిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ సమీపంలో వీర్ల చంద్రకళ (48) నివాసం ఉంటుంది. ఆమెకు గతంలో ప్రసాద్ అనే వ్యక్తితో వివాహమైంది. ఇద్దరు కుమారులు. 2008లో ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. చంద్రకళ వంట పని వద్ద పరిచయమైన తుమ్మపల్లి పుల్లారావుతో సహజీవనం చేస్తోంది. వీరిద్దరు కేఎల్ రావు నగర్ కుండల మార్కెట్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. మద్యం అలవాటున్న పుల్లారావు చంద్రకళను డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. మూడు రోజుల క్రితం చంద్రకళతో గొడవ పడి చంపేస్తానని బెదిరించాడు. 21న శుక్రవారం చంద్రకళ ఇంటి సమీపంలోని ఇనుప కొట్టుకు పనికి వెళ్లగా, పుల్లారావు ఇంటికొచ్చాడు. అయితే ఇంట్లో చంద్రకళ లేకపోవడంతో వెంటనే ఆమెకు ఫోన్ చేసి తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇంటికి రావాలని కోరాడు. రాత్రి ఇద్దరు భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున నిద్రలో ఉన్న చంద్రకళపై పుల్లారావు పెట్రోల్ పోశాడు. వెంటనే తేరుకునేలోగా అగ్గిపుల్ల వెలిగించి పడేశాడు. ఒంటిపై మంటలతో కేకలేసిన చంద్రకళ, బాత్రూమ్ వద్దకు చేరుకుని నీళ్లు పోసుకునేందుకు ప్రయత్నించింది. సాధ్యం కాకపోవడంతో రోడ్డుపైకి వచ్చి కేకలు పెట్టడంతో చుట్టుపక్కల మంటలను ఆర్పి 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మందుల దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

మందుల షాపు సీజ్, యజమాని అరెస్ట్

అవనిగడ్డ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మందులను పరిమితికి మించి అమ్ముతున్నట్టు శుక్రవారం జరిపిన ఆపరేషన్ గరుడ దాడిలో పట్టుబడిన భార్గవ మెడికల్ షాపును అధికారులు సీజ్ చేసి దాని యజమాని కొనకళ్ల రామ్మోహనరావు అరెస్టు చేశారు. శుక్రవారం ఈగల్, విజిలెన్స్, డ్రగ్ కంట్రోల్ బోర్డు శాఖల తనిఖీల్లో భార్గవ మెడికల్స్‌లో ఎన్‌ఆర్‌ఎక్స్ గ్రడ్‌గా పిలిచే ట్రిమడాల్, ఆల్ప్రాజోలమ్ ట్యాబ్లెట్లను 2022 నుంచి 2ఏళ్ల కాలంలో 55,961 మాత్రలు, 2,794 ఇంజెక్షన్లను విక్రయించినట్టు తెలసింది. ఈ దాడుల్లో భారీగా ఎన్‌ఆర్‌ఎక్స్ నిల్వలు బయటపడటంతో ఈ షాపు సీజ్‌తోపాటు షాపు యజమాని కొనకళ్ల రామ్మోహనరావును అరెస్టు చేశారు. ఆయనపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి శనివారం ఉదయం కోర్టుకు హాజరుపరుచగా, న్యాయమూర్తి ఆయనకు 14 రోజులుగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వెలంపల్లి అండదండలతోనే..: కనపర్తి

పట్టణంలో భార్గవ మందుల షాపులో అక్రమంగా పట్టుబడిన నిషేధిత మత్తు మందులు వెనుక పైకాపాకు చెందిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు హస్తం ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆరోపించారు. షాపు యజమాని కొనకళ్ల రామ్మోహనరావు ఎదరుడు విద్యాధరరావు వెల్లంపల్లికి అత్యంత సన్నిహితుడన్నారు. మరో సన్నిహితుడు కొండపల్లి బుజ్జి మెడికల్ వ్యాపారంలో కొనసాగుతున్నాడన్నారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, కర్రా సుధాకర్ పాల్గొన్నారు.

దుర్గగుడిలో 30 నుంచి ఉగాది ఉత్సవాలు

● ఏప్రిల్ 7న శ్రీరామనవమి

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో ఈనెల 30 నుంచి ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కే రామచంద్ర మోహన్ పూజాదికాల విశేషాలను పత్రికా ప్రకటనలో వివరించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఈనెల 30న దుర్గమ్మకు సుప్రభాతం అనంతరం స్నపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం అంతరాలయంలో నిర్వహించే సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ, ఖడ్గమాల, యాగశాలలో నిర్వహించే రుద్రహోమం రద్దు చేశారు. 31 నుంచి ఆర్జిత సేవలన్నీ రెగ్యులర్ షెడ్యూలు మేరకు జరుగుతాయి. కాగా ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7 నుంచి వసంత నవరాత్రుల పూజ లు జరుగుతాయి. కొండపైన లక్ష్మీ గణపతి స్వామి మందిరం వద్ద రోజుకో ప్రత్యేక పుష్పార్చన జరుగుతుంది. ఈ పుష్పార్చనల్లో దంపతులు పాల్గొనేందుకు రూ.2,500 రుసుం చెల్లించాలి. 7న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, అదేరోజు 10.30 గంటలకు శ్రీరామపట్టాభిషేకం కళావేదికపై నిర్వహిస్తారు. ఉగాది రోజున గంగ, పార్వతీ సమేత మల్లేశ్వర ఉత్సవమూర్తులతో వెండి రథోత్సవం జరుగుతుంది. 30న ఉదయం 9.15 గంటలకు కలశస్థాపన, ప్రత్యేక పుష్పార్చన జ రుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి చ ల్లా శ్రీనివాస శర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఏప్రిల్ 5న ఉదయం 6 గంటలకు క్షేత్రపాలకుడు అంజనేయస్వామివారికి, ఘాట్‌రోడ్, అమ్మవారి మెట్లమార్గం వద్ద నాగవల్లీ దళార్చన (తమలపాకులు) జరుగుతుంది. 6న ఉదయం 10 గంటలకు కళావేదికపై శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

వచ్చే ఏడాది ఆఖరుకు బందరు పోర్టు పూర్తి

● పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర ● అధికారులతో పనులు సమీక్షించిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ఆశలు నెరవేరుతున్నాయని, 2026లో బందరు పోర్టు నిర్మాణ పనులు పూర్తవుతాయని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. శనివారం సాయంత్రం కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర బందరు ఓడరేవు నిర్మాణ పనులపై పోర్టు అధికారులతో సమీక్షించారు. మొదటి దశ ప్రాజెక్టు లే అవుట్‌ను పరిశీలించారు. డ్రెడ్జింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పనులపై అధికారులతో మాట్లాడారు. పీపీటీ ద్వారా నిర్మాణ పనుల పురోగతి వివరాలను మెగా ఇంజనీర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం పోర్టు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్‌ను మార్చివేసిందని, దీంతో ఓడరేవు నిర్మాణం సకాలంలో పూర్తికాలేదన్నారు. సీఎం చంద్రబాబు పోర్టు పనులకు శంకుస్థాపన చేస్తే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ 27 శాతం పనులు మాత్రమే పూర్తి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోర్టు నిర్మాణ పనులు 37 శాతానికి పూర్తయ్యాయన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా బందరు పోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. నిర్మాణాలు పూర్తయితే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఆర్డీవో స్వాతి, మారిటోరియం బోర్డు సీఈవో పల్లా రాఘవరావు, మెగా ప్రాజెక్టు జనరల్ మేనేజర్ తులసీదాస్, కెప్టెన్ రాము, ఇంజనీర్లు శ్రీనివాసరావు, సతీష్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నేత పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.




డ్రెడ్జింగ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పట్టణంలో డ్రెయిన్లను పరిశీలిస్తున్న మంత్రి

రూ.164 కోట్లతో డ్రెయిన్ల అభివృద్ధికి అంచనాలు

నగరాన్ని సుందరనగరంగా చేసేందుకు డ్రైన్లు, పైపులైన్లు, పంపింగ్ పనులు పూర్తయ్యేందుకు రూ.164 కోట్లతో అంచనాలు రూపొందించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం కోనేరుసెంటర్, మునిసిపల్ కార్యాలయం, రాజాసెంటర్, బస్టాండ్, జిల్లాకోర్టు, లక్ష్మీటాకీసు సెంటర్ల వరకు కాలినడకన మంత్రి రవీంద్ర పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆక్రమణల తొలగింపుపై సమీక్షించారు. మురుగు కాలువల్లో మురుగు ఎలా పారుతున్నది పరిశీలించారు. జిల్లా కోర్టుసెంటర్‌లోని సబ్‌జైలు కాలువ నుంచి పోలీసు మైదానం వరకు పూడుకుపోయిన డ్రైన్‌ను పరిశీలించారు. బస్టాండ్ సెంటర్ నుంచి రైతుబజార్ వరకు మురుగు కాలువలు పూర్తిగా పూడిపోయాయి. ఆక్రమణల తొలగింపులో నష్టపోయిన బడ్డీకొట్ల వారికి ముద్ర రుణాలు అందచేస్తామన్నారు. టిడ్కో జీప్లస్ 3 లబ్ధిదారులు 400 మంది ఉన్నారని, వారిలో బ్యాంకు రుణం తీసుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉగాది నాడు గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. మచిలీపట్నంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద లబ్ధిదారులకు రూ. 2.50 లక్షలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారికి మరో రూ. 50వేలు అదనంగా ఇస్తామన్నారు. మంత్రితో పాటు మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత, టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, నేతలు పల్లపాటి సుబ్రహ్మణ్యం, పీవీ ఫణికుమార్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, టీడీపీ నగరాధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, గోకుల శివ, కోస్తా మురళీకృష్ణ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

రూ.14 లక్షల విలువైన 13.5 కేజీల వెండి, బంగారం, రెండు కార్లు రికవరీ


కేసు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ విద్యశ్రీ

ఘంటసాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగ కాళ్లకూరి కిరణ్‌బాబు, అతడి భార్య షేక్ అదాంబీను అరెస్ట్ చేసినట్టు అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ తెలిపారు. ఘంటసాల పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ విద్యశ్రీ మాట్లాడుతూ ఈనెల 10న రాత్రి శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెంలోని రామాలయంలో చోరీ జరిగినట్టు దేవాలయ నిర్వాహకుడు గాదె వంకటేశ్వరరావు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి, వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొండూరు మండలం గొల్లకోడూరు గ్రామానికి చెందిన కాళ్లకూరి కిరణ్‌బాబు విలాసాలకు బానిసై దొంగతనాలకు అలవాటుపడటంతో భార్య విడిపోయిందన్నారు. అతడిపై 2022కు ముందు 34 కేసులుండగా, శిక్షలు అనుభవించి ప్రస్తుతం పెనమలూరు మండలం పెదపులిపాకలో స్థిరపడి అదే ప్రాంతానికి చెందిన షేక్ అదాంబీని ఏడాదిన్నర క్రితం వివాహం చేసుకున్నాడన్నారు. 10న రాత్రి షేక్ అదాంబీతో కలిసి కారులో వచ్చి శ్రీకాకుళం శీలంవారిపాలెం ఆలయంలో దొంగతనానికి పాల్పడినట్టు దర్యాప్తులో తెలిసిందన్నారు. కేజీన్నర వెండి, 4 గ్రాముల బంగారం (కిరీటం, శఠగోపం, ఉత్తర. జంధ్యం, రామమాల, మంగళసూత్రం ముక్కుపుడక) దొంగిలించారన్నారు. వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు. 2022 నుంచీ ఇప్పటివరకూ 5 చోరీ కేసుల్లో నిందితుడు కాగా, షేక్ ఆదాంబీ మాత్రం శ్రీకాకుళం కేసులోనే నిందితురాలిగా ఉందన్నారు. పామర్రు స్టేషన్ పరిధిలో 2024లో జరిగిన దొంగతనంలో 4.23 కేజీల వెండిని, గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనంలో 2.25 కేజీల వెండి, విస్సన్నపేట పీఎస్ పరిధిలో కేసులో 5.5 కేజీల వెండి, చీరాల రూరల్ పీఎస్ పరిధిలో బంగారు హారం వీరి నుంచీ రికవరీ చేశామన్నారు. దొంగతనానికి ఉపయోగించిన రెండు కార్లను, సామగ్రిని సీజ్ చేశామన్నారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డిని అభినందించి, కానిస్టేబుల్స్ శివాజీ, వీరబాబు, మనోహర్, అశోక్, చంద్రశేఖర్, నాగరాజులకు క్యాష్ రివార్డులను అందజేసి అభినందించారు. నిందితులను మొవ్వ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

'ఇస్రో యువ విజ్ఞాన'కు దరఖాస్తుల ఆహ్వానం

- 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- నేటితో దరఖాస్తులకు ఆఖరు తేదీ
- అర్హత సాధించిన వారికి 14 రోజుల పాటు ఇస్రో కేంద్రంలో అవగాహన

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యువ శాస్త్రవేత్తలుగా రాణించాలనే వారికి అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆహ్వానం పలుకుతోంది. యువతకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది యువ విజ్ఞానం (యూవీకా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టే కార్యక్రమానికి 9వ తరగతి చదివే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనపరిచి ఉంటే 10శాతం వెయిటేజీ, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20శాతం, పట్టణ ప్రాంతాల వారికి 5 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఎంపికైన విద్యార్థులకు ఇస్రో అన్ని వసతులు సమకూరుస్తుంది. ప్రయాణం, భోజన వసతి ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది మే నెలలో 14 రోజులపాటు ఇస్రో అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళుతుంది. సైన్స్‌కు సంబంధించిన విశేషాలు, వింతలతోపాటు రాకెట్ ప్రయోగాలు, పనితీరుపై అవగాహన కల్పించనుంది.


సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఫైల్ ఫొటో)

నేటితో ముగియనున్న ఆఖరి తేదీ

9వ తరగతి విద్యార్థులు ఆదివారంలోపు www.isro.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తులు సమర్పించాలి. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను ఇస్రో యూవీకా విభాగం విడుదల చేస్తుంది. మే 18 నుంచి విద్యార్థులను విడతల వారీగా ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యూవీకా-25 నిర్వహించి 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ ఆధారంగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తారు.

యూవీకా నిర్వహించనున్న ప్రాంతాలు

హైదరాబాద్ (తెలంగాణ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్నాటక), డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), షిల్లాంగ్ (మేఘాలయ), అహ్మదాబాద్ (గుజరాత్).

'మ్యాన్‌హోల్' ముప్పు తప్పింది..!

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కంచికచర్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెవిటికల్లు గ్రామంలో అత్యంత ప్రమాదకరంగా, అపరిశుభ్రంగా ఉన్న మంచినీటి పైపులైన్ సరఫరా వాల్‌బిట్ మ్యాన్‌హోల్‌తో ముప్పు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి నానిబాబు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరసింహారావు మ్యాన్‌హోల్‌ని మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు. సిమెంట్ బల్లలతో మ్యాన్ హోల్‌పై మూతలు ఏర్పాటు చేశారు. చెవిటికల్లు గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


శుభ్రం చేసిన వాల్‌బిట్

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

గురివింద గింజ చందం పేర్ని నాని వైఖరి : యలవర్తి

గుడివాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి పేర్ని నానిని మచిలీపట్నంలో ప్రజలు అనర్హుడిగా ప్రకటించారని, పవిత్ర రంజాన్ ప్రార్థనలకు వచ్చి రాజకీయ విమర్శలు చేయడం దారుణమని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. ప్రజావేదికలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గురివింద గింజ సామెతగా పేర్ని నాని తీరు ఉందన్నారు. రాష్ట్రాన్ని దోచుకుతిన్న వైసీపీ నాయకులు నేడు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రిగా పనిచేసిన సమయంలో పేదల రేషన్ బియ్యాన్ని ఏ విధంగా దోచుకున్నారో అందరికీ తెలిసిందన్నారు. మాజీ కౌన్సిలర్లు అడుసుమిల్లి శ్రీనివాసరావు, వసంతవాడ దుర్గారావు, శౌంరి రామకృష్ణ, టిడిపి నాయకులు దానేటి సన్యాసిరావు, రాంబాబు, మురళీ, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

ముంచుతున్న డ్రెయిన్లు!

- పూడుకుపోతున్న ఐనంపూడి, గేదెలకోడు, బొప్పాయికోడు, భీమనది డ్రెయిన్లు
- వేసవిలో తవ్వకాలు జరపాలంటున్న రైతులు
- అడుగు ముందుకు వేయని అధికారులు
- ముంపు పాలిట పంట - నష్టపోతున్న రైతులు



గుర్రపు డెక్కతో నిండిపోయిన ఐనంపూడి డ్రెయిన్

(కూచిపూడి - ఆంధ్రజ్యోతి)

వేసవిలో డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టకపోవటం వల్ల ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో పంటను కోల్పోవాల్సి వస్తుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. మండలంలోని ఐనంపూడి, గేదెలకోడు, బొప్పాయికోడు, భీమనది డ్రెయిన్ల పూడికతీత చేపట్టకపోవడంతో ఖరీఫ్‌లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లి రైతులు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారని ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు డ్రెయిన్లు పంట కాలువలు పూడిక తీత పనులు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టకపోవటం రైతులపాలిట శాపంగా మారిందన్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత రైతులు వరినాట్లు వేసే సమయాల్లో తూతూ మంత్రంగా అధికారులు డ్రెయిన్ల మరమ్మతు పనులు చేపట్టడం వల్ల ఎక్కడి సమస్య అక్కడే అన్న చందంగా ఉందన్నారు. డ్రెయిన్లు మరమ్మతులకు నోచుకోకపోవటం వల్ల చేలల్లోని నీరు కిందకు వెళ్లక ఎగదన్ని పొలాలు ఏటా ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈప్రాంత రైతులు ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని పర్యాయాలు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించటం లేదన్నారు. ఈ ఏడాదైనా అధికారులు ముందుగా మేల్కొని డ్రెయిన్ల తవ్వకం, మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. చినముత్తేవి, కాజ, కోసూరు, మొవ్వ, పెదపూడి, వేములమడ, పద్దారాయుడు తోట, పెద ముత్తేవి తదితర గ్రామాల్లో రైతులను వేధిస్తున్న డ్రెయిన్ల పూడికతీత సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతోంది.

ప్రతి కుటుంబానికి 100 రోజులు పని చూపించాలి

జిల్లా ఉపాధి హామీ పథకం డైరెక్టర్ శివ ప్రసాద్ యాదవ్



ఉపాధి పనులు కావాలని పీడీని కోరుతున్న రుద్రపాక గ్రామస్థులు

నందివాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులపై జిల్లా ఉపాధి హామీ పథకం డైరెక్టర్ శివ ప్రసాద్ యాదవ్ శనివారం నందివాడ ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి పనుల్లో అకవతకలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులు కల్పించాలని రుద్రపాక గ్రామస్థులు ఆయనను కోరారు. ఎన్.వి.శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్క కుటుంబానికి 100 రోజులు పని తప్పనిసరిగా చూపించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో ఫీల్డ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేనిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లను, మేట్‌లను కూడా నియమించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామాలలో ఉపాధి పనులు చేసే ప్రాంతంలో తప్పనిసరిగా మంచినీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యం కల్పించాలన్నారు. ఎంపీపీ పెయ్యల ఆదాము, ఎంపీడీవో మల్లేశ్వరి, ఏవో కోటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో షాదీఖానా నిర్మిస్తాం

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



తోట్లవల్లూరులో ముస్లింలకు టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

తోట్లవల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో ముస్లింలకు షాదీఖానా నిర్మాణం చేపట్టి అండగా ఉంటానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామి ఇచ్చారు. తోట్లవల్లూరులో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు శనివారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరై భోజనం వడ్డించారు. షాదీఖానా కలను నిజం చేస్తానని, కబరస్థాన్ (శ్మశానవాటిక)కు ప్రహరీ నిర్మిస్తామని కుమార్ రాజా అన్నారు. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన హజ్‌యాత్రను సీఎం చంద్రబాబునాయుడు పునరుద్ధరిస్తున్నారని, వైసీపీ హయాంలో కుంటుపడిన దుల్హన్ పథకం ప్రవేశపెట్టి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ఇవ్వనున్నారని తెలిపారు. ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు రామినేని వెంకట కుటుంబయ్య, చింతపల్లి వెంకటేశ్వరరావు, యారగడ్డ రమేష్, నియోజ్యాకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎం ఎం దౌలా, షేక్ సలాం పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

గుడివాడ రూరల్ : మల్లాయిపాలెం మసీదులో జనసేన పార్టీ నాయకులు శుక్రవారం జబీఖాన్ మహబూబ్ బేగ్ (పండు)ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. జనసేన పార్టీ గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మజ్జి శ్రీనివాస్, షేక్ మీరా, షరీఫ్, నాగూర్, వేమూరి త్రినాథ్, సాయిన రాజేష్, బట్టు రవి, కిరణ్, కొట్టే శివ, సీతారామ్, వినోద్, వెంకట్రావు, పవన్, భాను, పూర్ణ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముఏస్లిం సోదరుల ఆధ్వర్యంలో మల్లాయిపాలెంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు.

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

గుడివాడ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు తక్కువ కాలంలో అపరాలు సాగు చేసుకోవటానికి అవకాశం ఉందని ఏవో బోలెం అనంతలక్ష్మి శనివారం కార్యాలయంలో తెలిపారు. మండలంలో జీలుగ విత్తనాల కోసం 103 క్వింటాళ్లు, పిల్లిపెసర 35 క్వింటాళ్లు, జనుము 16 క్వింటాళ్ల విత్తనాల కోసం ఇండెంట్ పెట్టామని తెలిపారు. త్వరలో వస్తున్నాయని తెలిపారు. ఈ విత్తనాలను వరి పొలాల్లో చల్లుకోవాలని సేంద్రియ ఎరువులుగా వాడుకోవచ్చునని తెలిపారు. కావాల్సిన రైతులు ముందుకు రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.



రామన్నపూడిలో పంటకుంట తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి

పంటకుంట రైతుకు ప్రయోజనకరం

గుడివాడ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పంట కుంటల తవ్వకం ఎంతో ప్రయోజనకరమని ఎంపీపీ గద్దె పుష్పరాణి తెలిపారు. రామన్నపూడి గ్రామంలో మీగడ శివ నాగరాజు పొలంలో పంటకుంట తవ్వకం పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.55,500 విలువ గల పనులు చేపట్టారు. పంటకుంట తవ్వకోవటం వల్ల ముందుగా నారుమడులు పోసుకో వటానికి, భూమి పొడిబారకుండా పొలంలో తడిగా ఉంటుందని తెలిపారు. గట్లపై చక్కటి కూర గాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చునని తెలిపారు. ప్రతి రైతు తమ పొలంలో కొంతభాగం నీటి కుంటలు తవ్వించుకోవాలన్నారు. ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, ఎంటీఎం క్లస్టర్ రామ్మోహనరావు, ఏపీవో దేవానందం, టీఏ రమేష్, పంచాయతీ కార్యదర్శి అనుల, రామకృష్ణ, మాజీ సర్పంచ్ మసిముక్కు గోపాలకృష్ణ, సూరపనేని రామకృష్ణ, మీగడ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కూచిపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిడుమోలు గ్రామంలో అనధికార మద్యం షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు మొవ్వ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.వరాల రాజు తెలిపారు. విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు - పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. వరాల రాజు మాట్లాడుతూ అనధికార మద్యం బెల్టుషాపులు నిర్వహించే వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మూడు అంతకంటే ఎక్కువ కేసులు నమోదైన వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు.

అలీనఖీపాలెంలో హజ్రత్ ఇమామ్ అలీ వర్ధంతి

- చెస్ట్‌బీటింగ్‌తో నివాళి



అలీనఖీపాలెంలో షియా ముస్లింల చెస్ట్ బీటింగ్

పమిడిముక్కల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : హజ్రత్ ఇమామ్ అలీ వర్ధంతిని పురస్కరించుకుని అలీనఖీపాలెంలో శనివారం హుస్సేని కమిటీ ఆధ్వర్యంలో ఇమామ్ అలీ జరీ నిర్వహించారు. గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించి అనంతరం ఇమామ్ హుస్సేన్ పంజా ఆవరణలో రక్తతర్పణం (చెస్ట్ బీటింగ్) చేసి ఇమామ్ అలీకి ఘనంగా నివాళులర్పించారు. చెస్ట్ బీటింగ్‌లో చిన్నా పెద్ద తేడా లేకుండా పాల్గొని ఇమామ్ అలీకి ఘనంగా నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు మిర్జా అబీద్ హుస్సేన్, కార్యదర్శి నజరా హుస్సేన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై రెల్లి సంఘం సంబరాలు



ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తున్న రెల్లిలు

గుడ్లవల్లేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టం చేయడం అభినందనీయమని రెల్లి కులాల సమూహ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగళగిరి లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం రెల్లి కులస్తులు గుడ్లవల్లేరులో మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సభాపతి అయ్యన్నపాత్రుడులకు ధన్యవాదాలు తెలిపారు.

కౌతవరం, గుడ్లవల్లేరులో ప్రజావేదిక నేడు

గుడ్లవల్లేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజావేదిక కార్యక్రమం ఆదివారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి నరసింహారావు తెలిపారు. గ్రామ ప్రజలు సమస్యలను ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు లిఖిత పూర్వక తెలియజేయాలన్నారు. అర్జీదారులు తప్పనిసరిగా ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరులు అర్జీలో రాయాలన్నారు. కౌతవరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి తెలిపారు.



సురక్షిత తాగునీటి పథకం ప్రారంభించి, వాటర్ టిన్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ప్రవాసాంధ్రులు ప్రగతికి వారధులుగా నిలవాలి

గుడ్లవల్లేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రవాసాంధ్రులు రాష్ట్ర ప్రగతికి వారధులుగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మామిడికోళ్ల గ్రామంలో జట్టి శ్రీరామ్(యుఎస్ఏ) కుమార్తె శ్రీవెన్ని జట్టి (యుఎస్ఏ) గోల్డ్ అవార్డు ప్రాజెక్ట్ నెల్కొల్పి అత్యాధుని సాంకేతిక పరిజ్ఞానంతో రూ11.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా గ్రామంలో అందరికీ కేవలం ఐదు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తారన్నారు. ఈ సందర్భంగా శ్రీవెన్నిని గ్రామస్థులు, ఎమ్మెల్యే రాము సన్మానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, డీసీ చైర్మన్‌లు పాలేటి ఆంజనేయిలు, సుబ్రహ్మణ్యా చౌదరి, మాజీ సర్పంచ్ తోట మల్లిఖార్జునరావు, మామిడికోళ్ల సర్పంచ్ వర్రే విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ తోట రాధిక, విశ్రాంత టీసీఎస్ సీనియర్ అధికారి తోట వెంకటేశ్వరరావు, కుసం బుజ్జి, కృష్ణంరాజు, రాము, ప్రసాద్, అల్లూరి శివ శ్రీనివాస్ (వాసు), రామ్మోహనరావు, రామారావు, ఎస్సై జి.వి.వి సత్యనారాయణ, ఆర్ఐ పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే ఈకేవైసీ



గుడ్లవల్లేరులో ఈకేవైసీ నమోదు

గుడ్లవల్లేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్‌కార్డుదారులు ఇళ్లకే రెవెన్యూ అధికారులు వెళ్లి ఈకేవైసీ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏ ప్రాంత రేషన్‌దుకాణదారులు ఆ ప్రాంతంలో వీఆర్వోల సమక్షంలో ఫింగర్ ప్రింట్ నమోదు చేయిస్తున్నారు. గుడ్లవల్లేరులో శనివారం వీఆర్వో ప్రకాష్ ఈకేవైసీలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం

గుడివాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు విద్య, ఉపాధి కల్పించి అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రపంచ దివ్యాంగుల అభివృద్ధి ట్రస్ట్ వ్యవస్థాపకులు చింతకాయల మోహన్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ప్రపంచ దివ్యాంగుల సంస్థ ట్రస్ట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. దివ్యాంగులను ఆదుకునేందుకు గుడివాడలో సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ డైరెక్టర్‌గా పంతంగి నాగేశ్వరరావు, సభ్యులుగా ఎం.రమణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, రమాదేవి, ఆశాలతలను నియమించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు భోజన వసతి కల్పించిన ఫాదర్ గుజ్జుల

బాలస్వామి కుటుంబం సేవలు అభినందనీయం

గుడివాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను అనాథాశ్రమంలో వదిలి వెళుతున్న తరుణంలో 41 సంవత్సరాలుగా గంటా బాలస్వామి జ్ఞాపకార్థం పేదలకు, వృద్ధులకు దుస్తులు, భోజన వసతి కల్పించడం అభినందనీయమని ఫాదర్ గుజ్జుల మైకేల్ అన్నారు. ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత(దేవాలయం)లో గంటా బాలస్వామి కుమారులు, కుమార్తెలు వృద్ధులకు ఏర్పాటు చేసిన భోజనం, టిఫిన్, పండ్లను ఫాదర్ గుజ్జుల మైకేల్, సహాయ గురువు ఫాదర్ అందుగుల శ్రీకాంత్ అందజేశారు. కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియం జోషి,సభ్యులు ఇంటి స్వామిదాసు, వీరాబత్తిన జీవరత్నం, వంగా అనంద్, మహేష్, బాలరాజు, యూత్ సభ్యులు, గంటా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యావికాస్ బ్లూమ్స్ స్నాతకోత్సవం

గుడివాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యావికాస్ బ్లూమ్స్‌లో చిన్నారుల స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా సీసీఎస్ సీఐ ఇంజరపు రమణి పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. అబాకస్, హ్యాండ్ రైటింగ్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన చిన్నారులకు అవార్డులు అందజేశారు. తొలుత పాఠశాల వ్యవస్థాపకులు ముప్పాళ్ల సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాం బశివరావు, అకడమిక్ డైరెక్టర్ వెల్లంకి రేష్మా చౌదరి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, ఇన్‌చార్జ్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సీఐ రమణి

కనీస వేతనాలు అమలు చేయాలి : సీఐటీయూ

ఉయ్యూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మి కులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో వివిధ పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శనివారం గండిగుంట, చినఓగిరాల, కాటూరు, కలవపాముల పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. బాలగంగాధర్, బి రాజేశ్, సుబ్బారావు పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ

తోట్లవల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరులో దొంగలు రెచ్చిపోయారు. గ్రామంలోని మూడు దేవాలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. చెరువు దగ్గర గంగానమ్మ గుడి తాళాలను బద్దలు కొట్టి అమ్మవారి మెడలో బంగారు ఆభరణాలను చోరీ చేశారు. వీరమ్మ తల్లి ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులకొట్టి కానుకలు ఎత్తుకుపోయారు. రామాలయం తాళాలు పగులకొట్టి గర్భగుడిలోకి ప్రవేశించలేకపోయారు. శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఓ దొంగ పలుగు చేతపట్టి సంచరించటం పాత పాఠశాల వద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డయిందని, సమాచారాన్ని టీడీపీ నాయకుల ద్వారా పోలీసులకు అందించామని గ్రామస్థులు చెప్పారు. మూడు దేవాలయాల్లో చోరీ ఘటనలు జరిగితే ఎలాంటి కేసులు లేవని ఎస్సై సీహెచ్ అవినాష్ చెప్పటం గమనార్హం. ఓ వైపు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైరు చోరీలు, మరోవైపు కల్లంలోని ఎండుమిచ్చి దొంగతనం, దేవాలయాల్లో చోరీలు జరగటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో జస్టిస్ రవినాథ్

మోపిదేవి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి దంపతులు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు న్యాయమూర్తి దంపతులకు ప్రసాదం అందజేశారు. అవనిగడ్డ, మొవ్వ న్యాయాధికారులు, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ పాల్గొన్నారు.

అల్లా ప్రేమతత్వం, త్యాగం అందరికీ ఆదర్శం

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అల్లా బోధనల్లోని ప్రేమతత్వం, త్యాగం అందరికీ ఆదర్శమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇంగ్లీషుపాలెంలో శనివారం రాత్రి తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్‌విందులో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు. మంత్రి స్వయంగా ముస్లిం సోదరులకు వడ్డించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణలను ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు.



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న మంత్రి రవీంద్ర



మోడల్ గోకులం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

మోడల్ గోకులానికి స్థల పరిశీలన

బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో మోడల్ గోకులానికి కావలసిన 10 ఎకరాల స్థలాన్ని మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. బీచ్‌కు దగ్గరలో స్థలాన్ని పరిశీలించారు. మచిలీపట్నంలో పశువుల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ఈ గోకులం దోహదపడుతుందన్నారు. డ్వామా పీడీ శివప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పాదరక్షల పంపిణీ

కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుడమేరు వరద బాధితులకు సేవలందించిన మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు శనివారం పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఎండి ఇలియాస్‌పాషా, పిప్పళ్ళ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రకు దిట్టకవి అభినందనలు

ఆక్రమణలు తొలగించడం వల్ల మచిలీపట్నం నగరం సుందరంగా రూపుదిద్దుకుం టుందని ఆంధ్రప్రదేశ్ మాజీ సలహాదారుడు, ప్రముఖ విద్యావేత్త, ప్రవాసాంధ్రుడు దిట్టకవి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర శనివారం బస్టాండ్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు రెండు గంటల సేపు పర్యటించారు. ఈ పర్యటనలో మంత్రిని దిట్టకవి వెంకటేశ్వరరావు కలిసి ఆక్రమణలను తొలగించడంలో చొరవ చూపినందుకు అభినందించారు.

కార్యకర్తలతో మంత్రి రవీంద్ర మమేకం

బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు శనివారం పర్యటించిన మంత్రి రవీంద్ర బస్టాండ్, ట్యాక్సీ స్టాండ్, రైతుబజార్ తదితర ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలు తొలగింపుపై మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి హరిబాబు, డీఈలతో చర్చలు జరిపారు. కార్యకర్తలు, నాయకులతో మమమేకమైన కొల్లు రవీంద్ర వారితో కలిసి టిఫిన్ చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.



శిక్షణతరగతుల్లో ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి అరుణ

ఉప సర్పంచ్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న ఉప సర్పంచ్ ఎన్నికలు పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ సూచించారు. మచిలీపట్నంలో శనివారం ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వార్డు సభ్యుల ద్వారా జరిగే ఈ ఎన్నికల కోసం 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయా పంచాయతీల్లో ఎన్నికల అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. డివిజన్ పంచాయతీ, మండల విస్తరణాధికారులు పాల్గొన్నారు.



బంటుమిల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు అర్జీ ఇస్తున్న రైతులు

బంటుమిల్లి కాల్వ గట్లపై ఆక్రమణలు తొలగించాలి

బంటుమిల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి బ్రాంచి కాల్వ భూమి సర్వే చేసి గట్లపై ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని కోరుతూ శనివారం బంటుమిల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు, నీటిపారుదల శాఖ ఏఈ రాజ్యలక్ష్మికి శనివారం రైతులు అర్జీ ఇచ్చారు. బంటుమిల్లి బ్రాంచ్ కాల్వ రెండు వైపులా కట్టలను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న తాడి చెట్లను నరకడమే కాకుండా కాల్వ సరిహద్దుగా ఉన్న పంట బోదెను సైతం పూడ్చివేశారన్నారు. అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడంతో ఆక్రమణదారులు రైతులను బెదిరించే స్థాయికి వచ్చారన్నారు. గతంలో కాల్వగట్లపై ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు తిరిగేవని, ఆక్రమణదారుల వల్ల ప్రస్తుతం నడక దారి మాత్రమే మిగిలిందన్నారు. అధికారులు ప్రజా ప్రతినిదులు స్పందించి ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయచేయాలని కోరారు.

పీఎం సూర్యఘర్ పథకంతో డబ్బు ఆదా

కోడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం వినియోగంతో పర్యావరణ పరిరక్షణతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందని అవనిగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. నరసింహాపురం గ్రామంలో మూడు కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ పథకానికి బ్యాంక్ రుణం కూడా అందుబాటులో ఉందని, సొంతానికి వాడుకోగా మిగిలిన విద్యుత్ గ్రిడ్ ఇవ్వడం ద్వారా ఆదాయం కూడా వస్తుందన్నారు. కోడూరు విద్యుత్ శాఖ ఏఈ కె.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.



నరసింహాపురంలో సౌర విద్యుత్ ప్లాంటును ప్రారంభిస్తున్న డీఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు



పంటకుంట తవ్వకం పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ

పంటకుంట ఎంతో ప్రయోజనకరం

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని భూగర్భ జలాలను రక్షించుకోవాలని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ మంచినీటి దినోత్సవం సందర్భంగా బందరు మండలం మంగినపూడి గ్రామంలో రైతు తాతా నాగేంద్రం పొలంలో పంటకుంట తవ్వకాన్ని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ ప్రారంభించారు. టీడీపీ నాయకులు తలారి సోమశేఖర్, మంగినపూడి గ్రామపెద్ద మెండు భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నాగాయలంక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బయోస్టిమ్యులెంట్లను రైతులకు విక్రయించరాదని ఎరువు దుకాణాలదారులకు మొవ్వ ఏడీఏ, తనిఖీ అధికారి ఎస్.శ్యామల ఆదేశించారు. పెదగౌడపాలెం, దిండి, తలగడదీవి, నాగాయలంక గ్రామాల్లోని దుకాణాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి స్టాక్ రికార్డులను, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. బయో స్టిమ్యులెంట్ ఎరువులు చట్టవిరుద్ధంగా విక్రయిస్తే దుకాణాలదారులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. వ్యవసాయాధికారి ఏ.సంజీవ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



తలగడదీవి ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్యామల

ఆశీల వసూలు ఆదాయం రూ.14 లక్షలు

నాగాయలంక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రోజువారీ, వారపు సంత ఆశీల వసూళ్లకు శనివారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించగా రూ.14లక్షల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో రోజూవారీ, వారపు సంత పాటలకు రూ.20.02 లక్షల ఆదాయం రాగా ఈ ఆర్థిక సంవత్సరంలో తగ్గింది. ఆశీల వసూలు హక్కు కోసం గత కొద్ది రోజులుగా రెండు సార్లు బహిరంగ వేలంపాటలను అధికారులు నిర్వహించారు. శనివారం మూడోసారి పాటలను నిర్వహించగా, గ్రామానికి చెందిన గుండాబత్తిన వెంకట కృష్ణారావు ఒక్కడే పాల్గొనడంతో అతనికే ఏడాది పాటు ఆశీలు వసూళ్లు చేసుకునే హక్కుదారుడుగా అధికారులు ప్రకటించారు. ఈవోపీఆర్డీ అప్పల నరసమ్మ, కార్యదర్శి జె.పవన్ కుమార్, సర్పంచ్ కైతేపల్లి అంకాలు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ డిగ్రీ కళాశాల, నవజీవన్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజ్ఞాన సముపార్జనకు నిరంతర కృషి

అవనిగడ్డ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు.

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు రూపొందించిన పత్రికలు ఆవిష్కరించారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎంపీపీ తుంగల సుమతిదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమాదేవి, శ్యాం కిషోర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, బంటుమిల్లి ప్రిన్సిపాల్ ఎస్.జగన్మోహనరావు, ప్రముఖులు మత్తి శ్రీనివాసరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, గుడిసేవ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

నవజీవన్ వార్షికోత్సవం

నవజీవన్ విద్యాసంస్థల 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి విద్యార్థులను అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ కొండవీటి ఈశ్వరరావు, ఏవో జయలక్ష్మి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ గమనం, మత్తి శ్రీనివాసరావు, గుడిసేవ విష్ణు ప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పసుపులేటి అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ విద్యార్థులు 41 మందికి ఉద్యోగాలు

పెడన రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఎంపికల్లో 41 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందటం అభినందనీయమని కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్ అన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఈసీ, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రిసెల్యూట్, రేడియంట్, యాక్సియోమ్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఈసీ నుంచి 32 మందిని, మెకానికల్ నుంచి తొమ్మిది మందిని 1.92 లక్షల వార్షిక వేతనంపై ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ దోసపాటి బాబా, తమ్మన సాయి, ప్రిన్సిపాల్ యస్‌వికె ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి ఆదిత్య, అధ్యాపకులు అభినందించారు..



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మంగళాపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చల్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల కారణంగా మంగళాపురం గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. మరమ్మతులు చేస్తున్నందున దళితవాడలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతం నుంచి హైస్కూల్ వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అగ్నిబాధితులకు సాయం

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బైపాస్‌రోడ్డు అగ్నిబాధితులకు లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సాయమందించింది. పేరిశెట్టి రామానాయుడు, కాజా వెంకటేష్, సిహెచ్ సింహాచలం ఇళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. వీరికి రూ. 20వేల ఖరీదు చేసే దుస్తులు, నిత్యావసర వస్తువులు, వంటసామాగ్రి అందజేశారు. లంకిశెట్టి బాలాజీ, అడపా మురళి, కమ్మిలి విజయకుమార్, కె.శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలికి ఆత్మీయ సత్కారం

కోడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను గంగానమ్మ దేవాలయ చైర్మన్ కోట యుగంధరరావు సత్కరించారు. ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఈనెల 31న జరిగే గంగానమ్మ జాతర మహోత్సవం ఆహ్వాన పత్రికను అందజేశారు. పూతబోయిన లక్ష్మణరావు, కంచర్లపల్లి శశి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరి మీనాక్షికి రావి నివాళి

మచిలీపట్నం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు తల్లి ఈశ్వరి మీనాక్షి చిత్రపటానికి శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈశ్వరి మీనాక్షి కుమారుడు నడకుదిటి అర్జునను పరామర్శించారు. పెరిక సంఘం రాష్ట్ర సాధికార సభ్యుడు రామదేని వేణుబాబు, జిల్లా తెలుగురైతు నాయకుడు ముళ్లపూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సంపటాలమ్మ గ్రామ సంచారం నేడు

చల్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మ గ్రామసంచారం ఆదివారం నుంచీ ప్రారంభం కానుంది. ప్రతి ఏటా అమ్మవారు గ్రామసంచారం చేయటం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారు గ్రామసంచారం చేస్తే ప్రజలు సుఖశాంతులతో ఉంటారనీ, ఆరోగ్యంగా ఉంటారని నమ్మకం. ఆదివారం ఉదయం ఆలయం నుంచి బయలుదేరి పడమరవీధిలోని అమ్మవారి పుట్టింటివారైన పత్తిపాటి వారి ఇంటికి వెళ్లి పసుపు కుంకుమలు సమర్పించి తిరిగి దేవాలయానికి వచ్చి ఆ తర్వాత గ్రామసంచారానికి వెళతారు. ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వంశపారంపర్య పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తే సర్‌చార్జి మినహాయింపు

చల్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సర్‌చార్జి నుంచి మినహాయింపు పొందాలని విద్యుత్‌శాఖ ఈఈ డి.కృష్ణానాయక్ ఒక ప్రకటనలో కోరారు. బిల్లు ఇచ్చిన తేదీ నుంచీ 15 రోజుల్లోగా బిల్లు చెల్లించినట్లయితే సర్‌చార్జి నుంచి మినహాయింపు పొందవచ్చన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధిత మండలాల ఏఈలకు తెలియచేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ రాయితీలను పొందాలన్నారు. సూర్యఘర్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని అవసరాలకు వినియోగించుకోవటంతోపాటు మిగులు విద్యుత్‌ను ఏపీడీపీడీసీఎల్‌కు విక్రయించవచ్చని వివరించారు. విద్యుత్ వినియోగదారులందరూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్ ఢీకొని గాయాలు

మోపిదేవి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతుండగా, బైక్ ఢీకొనటంతో కొక్కిలిగడ్డ ఏసోబు తీవ్రంగా గాయపడ్డాడు. కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన ఏసోబు కాసానగర్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా వెనుకగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో ఏసోబుకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగి తీవ్ర గాయాలపాలైన ఏసోబును అంబులెన్స్‌లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. మోపిదేవి ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

25 నుంచి ధార్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గుడివాకవారిపాలెం గ్రామంలో ఈనెల 25, 26, 27, 28 తేదీల్లో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ శనివారం తెలిపారు. గుడివాకవారిపాలెం కోదండ రామాలయంలో ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. గరికిపాటి వీరాంజనేయులు, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సమరసత సహ్రస ప్రముఖ్ లింగం బసవ శంకరరావు, భక్తులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

పెడన రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలో అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్, మట్టి తరలింపు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. కొర్లమూడి పరిసర గ్రామాల నుంచి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నారంటూ సమాచారం అందటంతో ఆర్ఐ విజయలక్ష్మి సిబ్బందితో దాడులు నిర్వహించారు. ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించారు. మళ్లీ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి, తాగునీటి అంశాలపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. డీసీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి నాయుడు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బి. రాజేశ్వరి, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారుల పాల్గొన్నారు.

వేదవ్యాస్ పరామర్శ

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన లేళ్లగరువు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయపురెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ శనివారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్, ధనేష్ తదితరులు పాల్గొన్నారు.